


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162






ఎడిటర్: మహేష్ యాదవ్ | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 281 | మంగళవారం 20 - 10 -2026 | పేజీలు : 12 | వెల-3

Published From : KURNOOL circulated at Nandyal Alluri SitharamaRaju,Anakapalli,Anantapur,Annamayya,Bapatla,Chittoor, Konaseema,East Godavari,Eluru,Guntur,Kakinada,Krishna,,NTR, Palnadu,Parvathipuram Manyam,Prakasam,Nellore,Sri Sathya Sai,Srikakulam,Tirupati,Visakhapatnam,Vizianagaram,West Godavari, YSR Kadapa,Hyderabad,Ranga Reddy,Medchal-Malkajgiri,Warangal,Hanamkonda,Nizamabad,Karimnagar, Khammam,


# ఏపీలో స్థానిక సమరం..

## ఏపీలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠా విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ నోటిఫికేషన్‌తో రాష్ట్రంలో మరోసారి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లయింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 659 జెడ్పీటీసీ స్థానాలకు, 9,829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎస్ఈసీ స్పష్టం చేశారు. వాస్తవానికి రాష్ట్రంలో 663 జెడ్పీటీసీలు, 9,859 ఎంపీటీసీలు ఉండగా, కొన్ని కారణాల వల్ల

**నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి**

**మొత్తం 659 జెడ్పీటీసీ, 9829 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు**

**అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ**

**జెడ్పీటీసీ అభ్యర్థికి రూ.8 లక్షలు, ఎంపీటీసీకి రూ.4 లక్షల ప్రచార ఖర్చు పరిమితి**

2లో



## పురపోరులో వైసీపీకి అభ్యర్థుల కరవు..

### 8 చోట్ల చైర్మన్ పీఠాలు ఏకగ్రీవం



**వైసీపీ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో ఖాయమైన కూటమి అభ్యర్థుల గెలుపు**

**పుంగనూరు, రాయచోటి, కమలాపురం వంటి చోట్ల కూడా వైసీపీకి అభ్యర్థుల కరవు**

2లో

**388 వార్డుల్లో నామినేషన్లు వేయని వైసీపీ**

ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న పురపాలక ఎన్నికల్లో అధికార కూటమికి పలుచోట్ల పోటీ లేకుండా పోయింది. రాష్ట్రంలోని ఎనిమిది పురపాలక సంఘాల్లో ఛైర్మన్ పదవులకు ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ అభ్యర్థులను నిలబెట్టకపోవడంతో, ఆ స్థానాలు అధికార కూటమికి ఏకగ్రీవం కానున్నాయి. ప్రకాశం జిల్లాలోని దర్శి, పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్ల, గురజాల నగర పంచాయతీలతో పాటు, వైఎస్ఆర్ కడప జిల్లాలోని యర్రగుంట్ల, మైదుకూరు, కమలాపురం, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, పుంగనూరు మున్సిపాలిటీల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఈ ప్రాంతాల్లో కేవలం కూటమి అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన అనంతరం,

## నారా లోకేశ్‌తో మిజోరం సీఎం భేటీ..

**మున్సిపల్ ఎన్నికలపై విపక్షాలకు లోకేశ్ చురకలు**



ఉండవల్లిలో మంత్రి లోకేశ్‌ను కలిసిన మిజోరం సీఎం లాల్‌దుహోమా

పురపాలక ఎన్నికలకు 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయన్న లోకేశ్

2లో

ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందని చెప్పడానికి నిదర్శనమని వ్యాఖ్య

## రోడ్డు వేస్తే ట్రాక్టర్ తో దున్నేశారు.. ఇదేం పైశాచిక ఆనందం?



ఉండవల్లిలో చంద్రబాబు మీడియా సమావేశం

2లో

స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్యర్థి పార్టీపై చంద్రబాబు విమర్శలు

మెగా డీఎస్సీని అడ్డుకోవాలని వందల సార్లు కోర్టుకెళ్లారని ఆగ్రహం

55 సేవలపై ప్రజల అభిప్రాయం తీసుకుని జవాబుదారీతనం పెంచామని వెల్లడి

విధ్వంసంతో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించామని ఉద్ఘాటన

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం వేసిన రోడ్డును కొందరు ట్రాక్టర్‌తో దున్నేశారని, ఇది వారి పైశాచిక ఆనందానికి, ఉన్మాదానికి నిదర్శనమని తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉండవల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈరోజు టీవీలో చూశాను.

## ఆఖరి నిమిషంలో అలా ప్రాణాలతో బయటపడ్డ హీరో టైగర్ ష్రాఫ్!



**ముంబైలో నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కలకలం**

**ఫుట్‌బాల్ సెషన్ ముగించుకుని వస్తుండగా దాడి**

**పాయింట్ బ్లాంక్‌లో మొరాయించిన దుండగుడి పిస్టల్**

ముంబైలో ప్రముఖ బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటన తీవ్ర కలకలం రేపింది. ఆదివారం రాత్రి జుహూ ప్రాంతంలో జరిగిన ఈ దాడిలో ఆయన త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో దుండగుడి చేతిలోని పిస్టల్ మొరాయించడంతోనే పెను ప్రమాదం తప్పిందని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పోలీసుల కథనం ప్రకారం.. జుహూలోని పుష్పా పార్క్ సమీపంలో టైగర్ ష్రాఫ్ ఫుట్‌బాల్ సెషన్ ముగించుకుని కారులో బయలుదేరారు. అప్పటికే అక్కడ దాదాపు 45 నిమిషాల పాటు వేచి చూసిన ముగ్గురు దుండగులు, రాత్రి 7 గంటల సమయంలో ఆయన కారును లక్ష్యంగా చేసుకుని కాల్పులకు తెగబడ్డారు. మొత్తం ఏడు రౌండ్లు కాల్పులు జరపగా, ఐదు బుల్లెట్లు కారుకు తగిలాయి. మిగతా రెండు గుళ్లు గురి తప్పాయి.

# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

**ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి మూడు రెట్ల వేగంతో సాగుతుందని హామీ**

2లో

**అభ్యర్థుల ఎంపికలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 63.6 శాతం స్థానాలు కేటాయింపు**

**విద్యావంతులకు, విధ్వంసకారులకు మధ్య జరుగుతున్న పోరు ఈ ఎన్నికలు**

**గత ప్రభుత్వ హయాంలోని అరాచకాలపై వీడియోలను ప్రదర్శించిన ముఖ్యమంత్రి**



## రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి..



తిరుపతి జిల్లాలో కొత్తగా వేసిన రోడ్డును ధ్వంసం చేసిన ఘటన

2లో

వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదుకు పవన్ ఆదేశం

నష్టాన్ని నిందితుల నుంచే వసూలు చేయాలని అధికారులకు సూచన



2లో

## శ్రీదేవి, భూదేవి సమేతంగా.. తిరుమలలో స్వర్ణ వైభవం

తిరుమల కొండపై ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు సోమవారం నిర్వహించిన స్వర్ణరథోత్సవం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు బంగారు రథంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన స్వర్ణరథోత్సవం మంగళవాయిద్యాలు, గోవింద నామస్మరణల నడుమ వైభవంగా సాగింది. స్వర్ణకాంతులతో మెరిసిన రథంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ ఉత్సవంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వర్ణరథాన్ని లాగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## శీతలామాత ఆలయం వద్ద లారీ బీభత్సం..

# 15 మంది భక్తులు బలి

**మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్2లో ఘోర ప్రమాదం**



2లో

## రోడ్డు ధ్వంసం చేసిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టండి..

ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని, వారిని ఏమాత్రం ఉపేక్షించేది లేదని ఏపీ డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తిరుపతి జిల్లా, పుల్లంపేట మండలం అనంతసముద్రం–పాపక్కగారిపల్లె గ్రామాల మధ్య కొత్తగా నిర్మించిన రోడ్డును వైసీపీ నేత ధ్వంసం చేసిన ఘటనపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని, ధ్వంసమైన రోడ్డుకు అయిన ఖర్చును వారి నుంచే వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు.'పల్లె పండుగ 3.0' కార్యక్రమంలో భాగంగా వారం రోజుల క్రితమే రూ.4.75 కోట్ల వ్యయంతో ఈ గ్రావెల్ రోడ్డును నిర్మించారు. అయితే, వైసీపీకి చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి, వెంకటసుబ్బారెడ్డి అనే మరో వ్యక్తి సహాయంతో ట్రాక్టర్‌తో రోడ్డును దున్ని సుమారు 100 మీటర్ల మేర ధ్వంసం చేశారు. గ్రామస్థులు అందించిన సమాచారంతో అధికారులు ఈ ఘటనపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. సోమవారం ఈ విషయంపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. ప్రజల సౌకర్యార్థం ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం క్షమించరాని నేరమని ఆయన అన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వైసీపీ నేత సుబ్బారెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ధ్వంసం వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసి, నిందితులపై రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించి ఆ మొత్తాన్ని వారి నుంచే రాబట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ దుర్మార్గపు చర్యకు పాల్పడిన వ్యక్తులతో పాటు వారి వెనుక ఉన్న శక్తులను కూడా చట్టం ముందు నిలబెట్టాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. నిందితులను ఈరోజు సాయంత్రంలోగా అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుస్తామని అధికారులు ఉప డిప్యూటీ సీఎంకు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే వారి వివరాలను ప్రజలందరికీ తెలిసేలా బహిర్గతం చేయాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించారు.

## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శుభాకాంక్షలు

రేపు (అక్టోబరు 20) విజయదశమి సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ గొప్ప స్ఫూర్తిని ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ మేరకు చంద్రబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. రైతన్నల శ్రమకు తగిన ఫలితం, మహిళలకు సాధికారత, యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు తమ ప్రభుత్వం చేస్తున్న సంకల్పానికి జగన్మాత అనుగ్రహం లభించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. "ఆ కనకదుర్గమ్మ ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తూ, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలి. ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు.




## ఏపీలో స్థానిక సమరం..

ఎన్నికల ప్రచార ఖర్చుపై కూడా కమిషన్ స్పష్టతనిచ్చింది. జెడ్పీటీసీ అభ్యర్థి గరిష్ఠంగా రూ.8 లక్షల వరకు, ఎంపీటీసీ అభ్యర్థి రూ.4 లక్షల వరకు ఖర్చు చేసుకోవచ్చని పునేఠా వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం 687 మందిని ఎంపీటీసీలకు, 28 మందిని జెడ్పీటీసీలకు రిటర్నింగ్ అధికారులు (ఆర్వో)గా నియమించినట్లు తెలిపారు.

**ఎన్నికల షెడ్యూల్ వివరాలు** ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, ఈ నెల అక్టోబర్ 21న రిటర్నింగ్ అధికారులు ఆయా స్థానాలకు ఎన్నికల ప్రకటన జారీ చేస్తారు. అదే రోజు ఓటర్ల జాబితాను కూడా ప్రదర్శిస్తారు. నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 21వ తేదీ ఉదయం 10:30 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అక్టోబర్ 23వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు.పరిశీలన, అప్పీళ్లు: అక్టోబర్ 24న నామినేషన్ పత్రాలను పరిశీలిస్తారు. తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యర్థులు అప్పీలు చేసుకునేందుకు అక్టోబర్ 25 వరకు గడువు ఉంటుంది. ఎంపీటీసీ అభ్యర్థులు ఆర్డీఓకు, జెడ్పీటీసీ అభ్యర్థులు జిల్లా కలెక్టర్‌కు అప్పీలు చేసుకోవాల్సి ఉంటుంది. అక్టోబర్ 26న ఈ అప్పీళ్లపై తుది నిర్ణయం తీసుకుంటారు.ఉపసంహరణ, తుది జాబితా: అక్టోబర్ 27వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.పోలింగ్, లెక్కింపు: నవంబర్ 3వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఏవైనా కారణాలతో పోలింగ్ నిలిచిపోతే, అవసరమైన చోట నవంబర్ 4న రీ–పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 5వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి, లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలను వెల్లడిస్తారు. ఈ షెడ్యూల్ ప్రకటనతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై దృష్టి సారించాయి.

## రోడ్డు వేస్తే ట్రాక్టర్ తో దున్నేశారు.. ఇదేం పైశాచిక ఆనందం?:

మేం రోడ్లు వేస్తే, ఆ రోడ్డును ట్రాక్టర్‌తో దున్నేశారు. ఇది భరించలేక చేస్తున్నారా, లేక ఉన్మాదమో, పైశాచిక ఆనందమో నాకు అర్థం కావడం లేదు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఓవైపు తాము అభివృద్ధి, జవాబుదారీ పాలన అందిస్తుంటే, మరోవైపు కొందరు విధ్వంసానికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం 55 రకాల సేవలను అందిస్తోందని, ఆర్టీసీ బస్సులు, ఆసుపత్రులు, అన్నా క్యాంటీన్లు, రేషన్ షాపుల వరకు ప్రతి సేవపైనా ప్రజల అభిప్రాయం తీసుకుంటున్నామని తెలిపారు. ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరించి, అధికారుల పనితీరును సమీక్షిస్తున్నామని అన్నారు. నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో అధికారుల ముందే వారి పనితీరుపై ప్రజల అభిప్రాయాలను చదివి వినిపిస్తూ, తప్పు చేస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నామని, ఇంతకంటే జవాబుదారీతనం ఎక్కడా ఉండదని స్పష్టం చేశారు.రాజకీయ విధ్వంసం కారణంగా కోల్పోయిన 'బ్రాండ్ ఏపీ'ని మళ్లీ పునరుద్ధరించి, పెట్టుబడులకు రాష్ట్రాన్ని నంబర్ వన్ గమ్యస్థానంగా తీర్చిదిద్దామని చంద్రబాబు అన్నారు. గత రెండున్నర ఏళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, ఇవి పూర్తయితే 20 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమానికి నాంది పలికామని, దీనివల్ల కరవు పరిస్థితుల్లోనూ నీటి సమస్య ఉండదని చెప్పారు. మెగా డీఎస్సీ విషయంలో ప్రతిపక్షాలు వ్యవహరించిన తీరును చంద్రబాబు తీవ్రంగా తప్పుపట్టారు. "పేద పిల్లలకు ఉద్యోగాలు రాకుండా ఉండేందుకు సుమారు 200–300 సార్లు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారు. మేం పట్టుబట్టి ఉద్యోగాలు ఇస్తే, మాపైనే ఆరోపణలు చేశారు. నిజం నిప్పు లాంటిది. దానితో ఆడుకుంటే మసైపోతారే తప్ప నిలవలేరు" అని హెచ్చరించారు. ఒకప్పుడు ఎడారిగా మారుతుందనుకున్న రాయలసీమ, నేడు తమ ప్రభుత్వ కృషితో 'రాయలసీమ రైజింగ్'గా ఎదుగుతోందని పేర్కొన్నారు. టెక్నాలజీని ఉపయోగించి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

# స్థానిక సంస్థల్లోనూ కూటమికి జై కొట్టండి

సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమికి పట్టం కడితే, కేంద్రం, రాష్ట్రం, స్థానిక ప్రభుత్వాల కలయికతో 'ట్రిపుల్ ఇంజన్' వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతుందని ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ప్రజాస్వామ్య పునాదులను మరింత పటిష్ఠం చేసేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉండాలని ఆకాంక్షించారు. సోమవారం అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికలతో క్షేత్రస్థాయిలో నాయకత్వం బలపడుతుందని, అందుకే సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రజలకు అందించాలనే లక్ష్యంతో అభ్యర్థుల ఎంపికలో ఎన్నడూ లేనంత కసరత్తు చేస్తున్నామని వివరించారు.పట్టణ స్థానిక ఎన్నికల్లో మాదిరిగానే గ్రామీణ ఎన్నికల్లోనూ ఇదే స్థాయిలో కసరత్తు చేస్తామన్నారు. 'ఆయారాం గయారాం' సంస్కృతికి స్వస్తి పలుకుతూ, మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లను ప్రజలే నేరుగా ఎన్నుకునే విధానాన్ని తీసుకొచ్చామని తెలిపారు. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభీష్టానికి ప్రాధాన్యతనిస్తూ, సామాజిక పునరేకీకరణ (సోషల్ రీ–ఇంజనీరింగ్) చేపట్టామని చెప్పారు. ఇందులో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు 63.6 శాతం స్థానాలు కేటాయించామని, ఒక్క బీసీలకే 35 శాతానికి పైగా సీట్లు ఇచ్చి పెద్దపీట వేశామని వెల్లడించారు. విద్యావంతులు, యువత, మహిళలు, పార్టీకి సేవలందించిన వారికే టికెట్లు ఇచ్చామని, ప్రతి మేయర్ స్థానాన్ని ఒక్కో సామాజిక వర్గానికి కేటాయించామని చంద్రబాబు పేర్కొన్నారు.

**చెప్పాం.. చేస్తున్నాం..** 2024 సార్వత్రిక ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్, 57 శాతం ఓట్ షేర్‌తో ప్రజలు చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, పవన్ కళ్యాణ్‌తో కలిసి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్నామని తెలిపారు. దేశంలోనే అత్యధికంగా సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమమని కొనియాడారు. ఎంతమంది పిల్లలుంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకాన్ని అమలు చేస్తున్నామని, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి, దీపం–2.0 వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామన్నారు. విశాఖ, విజయవాడల్లో సంపూర్ణ హక్కులతో ఇళ్ల పట్టాలు, 'రాజముద్ర'తో పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, డేటా సెంటర్ల నుంచి డిఫెన్స్ ప్రాజెక్టుల వరకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. 2029 నాటికి 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, గోదావరి–కావేరి అనుసంధానంతో దక్షిణాది రాష్ట్రాల నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య పోటీ** ఈ స్థానిక ఎన్నికలు విద్యావంతులకు, గంజాయి బ్యాచ్‌కు మధ్య జరుగుతున్న పోటీ అని చంద్రబాబు అభివర్ణించారు. అభివృద్ధి, సంక్షేమమే ఎన్డీఏ అజెండా అయితే, హింసను ప్రేరేపించడమే 'గొడ్డలి పార్టీ' విధానమని విమర్శించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోరంగా ఓడినా ఆ పార్టీకి బుద్ధి రాలేదని, స్థానిక ఎన్నికల్లోనూ విధ్వంసానికే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు తన అవినీతి, అక్రమాల నుంచి రక్షణ పొందేందుకే 'జెన్–జీ' అంటున్నారని, వారిని పావులుగా వాడుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. "గొడ్డలి పార్టీ చేసిన అకృత్యాల నుంచి జెన్–జీ కాపాడాలా?" అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో నాటి అక్రమాలను ప్రశ్నించిన ఎస్ఈసీపైనే ఎదురుదాడి చేసి, ఆయన ప్రాణరక్షణ కోసం కేంద్రాన్ని ఆశ్రయించే దుస్థితి కల్పించారని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో భూములను దోపిడీ చేయాలని చూశారని, ప్రజల ఆస్తులపై నాటి సీఎం తన బొమ్మలు వేసుకున్నారని విమర్శించారు. దేవాలయాలను అపవిత్రం చేసి, కల్తీ ప్రసాదాలు తయారు చేయించారని, ప్రస్తుతం తాము పవిత్ర వాతావరణాన్ని నెలకొల్పుతున్నామని చెప్పారు.

## శీతలామాత ఆలయం వద్ద లారీ బీభత్సం.. ప్రమాదంలో 30 మందికి పైగా గాయాలు, పలువురి పరిస్థితి విషమం

### ఎస్పీపై వేటు, 8 మంది పోలీసుల సస్పెన్షన్

### రాజస్థాన్‌లో లారీ డ్రైవర్, యజమాని అరెస్ట్

మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో నవరాత్రి ఉత్సవాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. శీతలామాత ఆలయం వద్ద భక్తులపైకి ఓ లారీ దూసుకెళ్లడంతో 15 మంది దుర్మరణం చెందారు. ఇద్దరు పోలీసులు సహా 30 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం, గ్వాలియర్ ఎస్పీని తొలగించి, మరో 8 మంది పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసింది.గ్వాలియర్ నగరానికి 20 కిలోమీటర్ల దూరంలోని శీతలామాత ఆలయం వద్ద శనివారం–ఆదివారం మధ్యరాత్రి 1:30 గంటల సమయంలో ఈ ఘోర దుర్ఘటన జరిగింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ సమయంలో ధాన్యం లోడుతో పంజాబ్ రిజిస్ట్రేషన్ గల లారీ, భారీ వాహనాలకు ప్రవేశం లేని నిషేధిత మార్గంలోకి ప్రవేశించింది. ఏటవాలుగా ఉన్న ఈ దారిలో పోలీసు బారికేడ్లను ఢీకొట్టి, వేగంగా భక్తులపైకి దూసుకెళ్లింది. అనంతరం ఆలయ ప్రవేశ ద్వారాన్ని, గోడను ఢీకొట్టి ఆగింది. బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. గూగుల్ మ్యాప్స్ చూపించిన షార్ట్‌కట్ మార్గంలో డ్రైవర్ ఈ దారిలోకి వచ్చి ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు.ఈ దుర్ఘటనలో 13 ఏళ్ల బాలుడి నుంచి 50 ఏళ్ల వృద్ధురాలి వరకు పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రుల వద్ద మృతదేహాలను చూసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆవేదనలతో ఆ ప్రాంతమంతా హృదయవిదారకంగా మారింది. "రెండు చక్రాల వాహనాలకు కూడా అనుమతి లేని చోటికి లారీ ఎలా వచ్చింది?" అని బాధితులు ప్రభుత్వాన్ని నిలదీశారు. భద్రతా వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని వారు ఆరోపించారు.ఘటనపై తీవ్రంగా స్పందించిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్, తక్షణమే గ్వాలియర్ ఎస్పీ రవి భదౌరియాను తొలగించారు. ముగ్గురు ఎస్‌హెచ్‌ఓలు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సహా మొత్తం 8 మంది పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.4 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. చికిత్స ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రమాదం జరిగిన తర్వాత పారిపోయిన లారీ డ్రైవర్ దిల్‌బాగ్ సింగ్, యజమానిని రాజస్థాన్‌లోని ధోల్‌పూర్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న ఏపీ ఇంటర్ బోర్డు ఏడీ దుర్గాప్రసాద్..!

### -ఆలయ ఈవో యం.రామక్రిష్ణ.

**పాణ్యం.నంది పత్రిక . అక్టోబర్ 19.** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసి యున్న శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు విద్యాశాఖ సహాయ సంచాలకులు (అసిస్టెంట్ డైరెక్టర్) దుర్గాప్రసాద్ సోమవారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికార సిబ్బంది అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ స్వామివారికి అర్చనలు, అభిషేకములు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆశీర్వ మంటపము నందు వారికి శేష వస్త్రములతో, పూలమాలలతో ఘనంగా సత్కరించి ప్రసాదము, స్వామివారి చిత్రపటమును అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డును దున్నేసినందుకు సిగ్గుపడాలి: నారా లోకేశ్

తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో దారుణమైన ఘటన చోటుచేసుకుందని, వైసీపీ నాయకుల కక్షపూరిత చర్యలకు ఇది నిదర్శనమని ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ప్రజల కోసం రూ.4.75 కోట్లతో నిర్మించిన తారు రోడ్డును, వేసిన నాలుగు రోజులకే వైసీపీ నేతలు ట్రాక్టర్‌తో ధ్వంసం చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్య దిగ్భ్రాంతికరమని, సిగ్గుచేటని ఆయన అభివర్ణించారు.పుల్లంపేట మండలంలోని అనంతసముద్రం, పాపక్కగారిపల్లె గ్రామాల ప్రజల సౌకర్యార్థం ఈ రోడ్డును నిర్మించామని లోకేశ్ తెలిపారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ ఫలించి రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో గ్రామస్థులు సంతోషంగా ఉన్నారని, కానీ వారి ఆనందాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నేతలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని అన్నారు. "ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం రాజకీయం అనిపించుకోదు. ఇది కచ్చితంగా ప్రజలపై జరిగిన అహంకారపూరిత దాడి. కక్ష సాధింపు చర్యలతో ప్రజాధనాన్ని ఇలా నాశనం చేయడం అత్యంత హేయమైన చర్య" అని లోకేశ్ తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను, జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆయన కోరారు. ధ్వంసమైన రోడ్డును వీలైనంత త్వరగా పునరుద్ధరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి అరాచక చర్యలను ఉపేక్షించేది లేదని, చట్టప్రకారం నిందితులకు శిక్ష పడేలా చూస్తామని ఆయన హెచ్చరించారు.

## ఒక్క ఓటు కూడా చీలకూడదు.. విజయవాడలో వంగవీటి రాధాను గెలిపించుకుందాం: టీడీపీ ప్రకటన

విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికల నేపథ్యంలో, కూటమి అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ అభ్యర్థిత్వంపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారానికి తెలుగుదేశం పార్టీ చెక్ పెట్టింది. రాధాకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేస్తూ అధికారికంగా ఓ ప్రకటన విడుదల చేసింది. కొద్ది రోజులుగా రాధా అభ్యర్థిత్వంపై టీడీపీలో భిన్నాభిప్రాయాలు ఉన్నట్లుగా సాగుతున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తూ, అది పూర్తిగా అవాస్తవమని తేల్చి చెప్పింది. ఈ మేరకు టీడీపీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. "కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందరూ చూస్తున్నారు. ఇప్పుడు విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా కూటమి అభ్యర్థినే గెలిపించుకుందాం," అని పిలుపునిచ్చింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడిగా బరిలో నిలిపిన వంగవీటి రాధాకృష్ణను తిరుగులేని మెజార్టీతో గెలిపించాలని కోరింది.కులాల పేరుతో రెచ్చగొట్టి ఓట్లు చీల్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అలాంటి కుట్రలను తిప్పికొట్టాలని టీడీపీ తన ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. "కులం పేరుతో ఎవరు ఎన్ని విధాలుగా రెచ్చగొట్టినా కూటమి ఓటు చీలకుండా మన అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను గెలిపించుకుందాం. కులతత్వం రెచ్చగొడుతున్న వారికి దీటుగా సమాధానం ఇద్దాం" అని పార్టీ శ్రేణులకు, ప్రజలకు స్పష్టం చేసింది. రాధా గెలుపు కోసం కూటమిలోని మూడు పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయని, ఆయన విజయంతో విజయవాడ కార్పొరేషన్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని టీడీపీ భరోసా ఇచ్చింది.



## పురపోరులో వైసీపీకి అభ్యర్థుల కరవు..

ఈ పదవులన్నీ అధికారికంగా ఏకగ్రీవమైనట్లు ప్రకటిస్తారు.మరోవైపు, జమ్మలమడుగు, అనంతపురం జిల్లాలోని గూటిలో వైసీపీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించినప్పటికీ వారు నామినేషన్లు వేయలేదు. జమ్మలమడుగు స్థానానికి ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి భార్య పేరును ఖరారు చేసినప్పటికీ, ఆమె పోటీ నుంచి తప్పుకున్నారు. అక్కడ కొందరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేయగా, వారు కూడా ఉపసంహరించుకుంటే ఆ సీట్లు కూడా ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంది. వైసీపీ కంచుకోటలుగా భావించే పులివెందుల, పుంగనూరు, కమలాపురం వంటి ప్రాంతాల్లోనూ అభ్యర్థులను నిలబెట్టలేని పరిస్థితి నెలకొంది. తొలిదశలో 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలో ఆదివారం రాత్రి నాటికి 388కి పైగా వార్డులలో వైసీపీ తరఫున ఎటువంటి నామినేషన్లు దాఖలు కాలేదు.

## నారా లోకేశ్‌తో మిజోరం సీఎం భేటీ.. మున్సిపల్ ఎన్నికలపై విపక్షాలకు లోకేశ్ చురకలు

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లాల్‌దుహోమాను శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు.ఇదిలా ఉండగా, రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఎన్నికలకు రికార్డు స్థాయిలో 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పార్టీ, ప్రతి వర్గం, నలుమూలల నుంచి అభ్యర్థులు ముందుకు రావడం ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందనడానికి నిదర్శనమని అన్నారు. ఒక్క ఓటు కూడా పడకముందే అక్రమాలు జరిగాయని ఆరోపించే వారు ఒక విషయం గుర్తుంచుకోవాలని లోకేశ్ హితవు పలికారు. "ఎన్నికల్లో గెలుపు క్షేత్రస్థాయిలో ఉంటుంది కానీ, పత్రికా సమావేశాల్లో కాదు. ప్రజలను ఎదుర్కోండి, ప్రజలే ఫలితాలను నిర్ణయిస్తారు" అని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరగనున్న విషయం తెలిసిందే.

## ఆఖరి నిమిషంలో అలా ప్రాణాలతో బయటపడ్డ హీరో టైగర్ ష్రాఫ్!

దాడి సమయంలో ఒక షూటర్ కారు కిటికీ వద్దకు వచ్చి, దగ్గరి నుంచి టైగర్‌పై కాల్పులు జరిపేందుకు ప్రయత్నించాడు. అయితే, రెండుసార్లు ప్రయత్నించినా అతని చేతిలోని నాటు తుపాకీ మొరాయించింది. దీంతో బుల్లెట్ బయటకు రాలేదు. ఆ సమయంలో దుండగుడు తుపాకీతో ఇబ్బంది పడుతున్న దృశ్యాలు వీడియో ఫుటేజ్‌లో కనిపించాయి. ఈ ఘటనలో టైగర్ ష్రాఫ్ సురక్షితంగా బయటపడగా, ఆయన డ్రైవర్ ఫిర్దాస్ ఎడమ చేతికి బుల్లెట్ గాయమైంది. సమీపంలో ఉన్న మరో వ్యక్తి కూడా గాయపడినట్లు తెలిసింది. దాడి అనంతరం నిందితులు మోటార్‌సైకిల్‌పై అంధేరి వెస్ట్ రైల్వే స్టేషన్ వైపు పారిపోయారు. అక్కడ తమ వాహనాన్ని వదిలేసి పరారయ్యారు. ఈ దాడికి తామే బాధ్యులమంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ అనుచరుల పేరుతో ఒక సోషల్ మీడియా సందేశం వైరల్ కావడంతో పోలీసులు ఆ కోణంలోనూ దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనా స్థలంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తూ, నిందితుల కోసం గాలిస్తున్నారు.

## శ్రీదేవి, భూదేవి సమేతంగా.. తిరుమలలో స్వర్ణ వైభవం

స్వర్ణరథంపై స్వామివారి దివ్యదర్శనం సకల శుభాలను ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్, చిన్నజీయర్ స్వాములు, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, నన్నపనేని సదాశివరావు, సీవీఎస్వో మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పసుపు జెండా వైపు అడుగులు.. టీడీపీలోకి 20 కుటుంబాలు

### ఎద్దుపెంటలో వైఎస్సార్‌సీపీకి ఎదురుదెబ్బ.. ఎమ్మెల్యే కోట్ల సమక్షంలో పార్టీలో చేరిక

**డోన్ నంది పత్రిక, అక్టోబర్ 19:** డోన్ మండలంలోని ఎద్దుపెంట గ్రామంలో తెలుగుదేశం పార్టీకి మద్దతు పెరుగుతోంది. గ్రామానికి చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి సమక్షంలో ఈ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన కుటుంబాల సభ్యులకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ పరిణామంతో ఎద్దుపెంట గ్రామంలో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆకర్షితులై చేరికలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వివిధ వర్గాలకు చెందిన ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని తెలిపారు.



ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ రహదారులు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు.

**పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**తెలుగుదేశం పార్టీలో నూతనంగా చేరిన కుటుంబాల సభ్యులు పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామస్థులతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని అన్నారు.

గ్రామాల్లో పార్టీని బలోపేతం చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని నూతన సభ్యులకు దిశానిర్దేశం చేశారు.

**టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం** ఎద్దుపెంట గ్రామానికి చెందిన 20 కుటుంబాలు ఒకేసారి టీడీపీలో చేరడం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ చేరికలతో గ్రామంలో పార్టీ కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశం ఉందని స్థానిక టీడీపీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో మరింత మంది ప్రజలు పార్టీ వైపు మొగ్గు చూపుతారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, పార్టీలో నూతనంగా చేరిన కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

# టీడీపీని వీడి వైస్సార్సీపీ లో చేరిక.



**బేతంచెర్ల అక్టోబర్ 19( నంది పత్రిక ).** బేతంచెర్ల పట్టణంలోని శేషారెడ్డి నగర్ కాలనీలోని 3వ కౌన్సిలింగ్ వార్డు చెందిన షేక్ అబ్దుల్ సలాం, చిన్న గుమ్మ వెంకటేశ్వర్లు, పి ప్రకాష్, డి సత్యం, ఏ శ్రీనివాసులు, డి హుస్సేన్ భాష, వై ఆంజ నేయులు, పోల బాలన్న, వజ్రగిరి సాలయ్య, వజ్రగిరి ఆంజ నేయులు, పోల మధు, పోల మద్దిలేటి లు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, దూదేకుల మా భాష ఆధ్వర్యంలో సోమవారం బేతంచెర్ల పట్టణంలోని వైస్సార్సీపీ కార్యాలయంలో మాజీ మంత్రివర్యులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సమక్షంలో వైస్సార్సీపీ పార్టీలో చేరారు. వీరిని మాజీ మంత్రి బుగ్గన వైస్సార్సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వైస్సార్సీపీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల పరిశీలనలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

### జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియను ఎన్నికల నిబంధనల ప్రకారం అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి/ జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి మున్సిపల్ కమిషనర్లను, రిటర్నింగ్ అధికారులను, ఏఆర్వోలను ఆదేశించారు.సోమవారం స్థానిక సంస్థల ఎన్నికలు2026 నిర్వహణ లో భాగంగా అర్బన్ లోకల్ బాడీస్ ఎన్నికల నిర్వహణ , నామినేషన్ ల స్క్రూటినీ అంశాలపై జిల్లా ఎన్నికల అధికారి/ జిల్లా కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ లు, ఆర్వో లు, ఏ ఆర్వో లు, నోడల్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్లన పరిశీలించే సమయంలో నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలను జారీ చేయడంలో జాప్యం జరగకుండా చూడాలని, తహశీల్దార్ల స్థాయిలో సమస్యలు ఎదురైతే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి వెంటనే తీసుకురావాలన్నారు. నామినేషన్ల పరిశీలనలో ఏవైనా సందేహాలు తలెత్తితే ఎన్నికల మాన్యువల్‌తో పాటు ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా మార్గదర్శకాలను పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఆర్వో లు, ఏ ఆర్వో లు, తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ పత్రాల ముద్రణకు పకడ్బందీ ఏర్పాట్లు





### మేయర్, కార్పొరేటర్ల అభ్యర్థుల ఎన్నికలకు 10 లక్షల బ్యాలెట్ పేపర్ల ముద్రణ

### బ్యాలెట్ పత్రాల ముద్రణలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదు

### భద్రత, గోప్యత విషయంలో అప్రమత్తంగా ఉండాలి

### ప్రింటింగ్ ప్రెస్ సెంటర్ల వద్ద పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు, బారికేడ్లు

### అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, కమిషనర్ చల్లా ఓబులేసు

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పత్రాల ముద్రణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అడిషనల్ ఎలక్షన్ అథారిటీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. సోమవారం పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లోని ప్రింటింగ్ ప్రెస్‌లను పరిశీలించారు. మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులకు సంబంధించి మొత్తం 10 లక్షల బ్యాలెట్ పత్రాల ముద్రణకు తీసుకోవాల్సిన చర్యలతో పాటు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో 4,79,861 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ప్రతి ఓటరు మేయర్ అభ్యర్థికి ఓటు వేసేందుకు ఒక బ్యాలెట్ పత్రం, కార్పొరేటర్ అభ్యర్థికి ఓటు వేసేందుకు మరో బ్యాలెట్ పత్రం వినియోగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వీటికి అదనంగా పోలింగ్ కేంద్రాల్లో 10 శాతం బ్యాలెట్ పత్రాలను అందుబాటులో ఉంచాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 10 లక్షల బ్యాలెట్ పత్రాల ముద్రణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ముద్రణ ప్రక్రియలో పూర్తి గోప్యత పాటిస్తూ, బ్యాలెట్ పత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రింటింగ్ ప్రెస్ కేంద్రాల వద్ద అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రింటింగ్ ప్రెస్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఆఖరి బ్యాలెట్ పత్రం ముద్రణ పూర్తయ్యే వరకు నిర్విరామంగా ముద్రణ ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు. ముద్రించిన బ్యాలెట్ పత్రాల లెక్కింపు, భద్రపరచడం, తరలింపు ప్రక్రియలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు.అదేవిధంగా అథెనా స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్‌కు ముందు రోజు ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల సామగ్రి పంపిణీ చేసేందుకు అవసరమైన రిసెప్షన్ ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. కృష్ణ, ఎస్ఈ రమణమూర్తి, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డీసీపీ శబ్నం శాస్త్రీ, కార్యదర్శి నాగరాజు, ఆర్వో వాజిద్, డీఈఈలు నరేష్, పవన్ కుమార్ రెడ్డి, కృష్ణలత, శ్రీనివాసన్, ఎలక్ట్రికల్ సూపర్వైజర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# నాటు సారాయి తయారీకి సిద్ధం చేసిన 150 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

### సీతమ్మ తాండ కొండ ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు



**డోన్ నంది పత్రిక, అక్టోబర్ 19:** నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ అధికారులు నాటు సారాయి తయారీపై చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సీతమ్మ తాండ కొండ ప్రాంతాల్లో నాటు సారాయి తయారీ కోసం నిల్వ ఉంచిన సుమారు 150 లీటర్ల బెల్లం ఊటను అధికారులు గుర్తించి ధ్వంసం చేశారు. నాటు సారాయి తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో సీతమ్మ తాండ పరిసర కొండ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించగా, నాటు సారాయి తయారీకి ఉపయోగించేందుకు సిద్ధంగా ఉంచిన బెల్లం ఊటను గుర్తించారు. వెంటనే దానిని ధ్వంసం చేసి, నాటు సారాయి తయారీని అడ్డుకున్నారు. ఈ దాడిలో ఎక్సైజ్ ఎస్సై దౌలత్ ఖాన్‌తో పాటు సిబ్బంది సుధాకర్ రెడ్డి, కుమార్, ఉమాకాంత్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో అక్రమంగా నాటు సారాయి తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. అక్రమ మద్యం తయారీ, విక్రయాలపై నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

### ఈ నెల 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ

### జెడ్పీ కార్యాలయంలో జెడ్పీటీసీ, ఎంపీడీవో కార్యాలయాల్లో ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ

### జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా ఎన్నికల అధికారి/జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్ర ఎన్నికల ఆదేశాల మేరకు ఈ నెల 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు నిర్వహణ జరుగుతుందని తెలిపారు, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన నామినేషన్లను జిల్లా పరిషత్ కార్యాలయంలో, ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన నామినేషన్లను ఆయా మండలాల్లోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయాల్లో నియమిత రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తారన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే 26 మంది రిటర్నింగ్ అధికారులను నియమించామని, ఎన్నికల ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టామన్నారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ,ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు.

**జిల్లాలో 26 జడ్పీటీసీ, 432 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు**

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా 26 జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జడ్పీటీసీ), 432 మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (ఎంపీటీసీ) స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

**ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్** ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబర్ 19న అక్టోబర్ 21 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై, అక్టోబర్ 23న ముగుస్తుందని పేర్కొన్నారు. అక్టోబర్ 24న నామినేషన్ల పరిశీలన,

అక్టోబర్ 25న తిరస్కరణకు గురైన నామినేషన్లపై అప్పీళ్లు, అక్టోబర్ 26న అప్పీళ్ల పరిష్కారం ఉంటుందని వివరించారు. అక్టోబర్ 27న నామినేషన్ల ఉపసంహరణతో పాటు తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారని, నవంబర్ 3న పోలింగ్, అవసరమైతే నవంబర్ 4న రీపోలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుందని కలెక్టర్ వివరించారు.

# రుద్రవరంలో ఘనంగా మహానవమి

### శ్రీ వాసవీ దేవిగా అమ్మవారి దర్శనం.. వైభవంగా మహా చండీ హోమం



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 19 (నంది పత్రిక):** రుద్రవరం మండల కేంద్రంలో దసరా నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకుని అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. మహానవమి (సోమవారం) పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారు ఆర్యవైశ్యుల ఇలవేల్పు అయిన 'శ్రీ వాసవీ దేవి' అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. అహింస, శాంతి, ధర్మ రక్షణలకు ప్రతిరూపమైన వాసవీ మాతను పూజిస్తే కుటుంబంలో సుఖశాంతులు, సకల శుభాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. తెలుగునాట నవరాత్రి ఉత్సవాలలో మహానవమికి ఎంతో విశిష్టత ఉంది; ఈ రోజున అమ్మవారిని ఉగ్రరూపంలో మరియు శాంతరూపంలో ఆరాధించి హోమాలు చేయడం వల్ల అరిష్టాలు తొలగిపోయి అఖండ విజయాలు కలుగుతాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి విశేష పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలో పండితులు 'మహా చండీ హోమం' అత్యంత శాస్త్రోక్తంగా జరిపారు. సాధారణంగా ఈ మహా చండీ హోమానికి ముందుగా.. ఎటువంటి విఘ్నాలు కలగకూడదని 'మహా గణపతి హోమం', గ్రహ దోషాల నివారణకు 'నవగ్రహ హోమం', అలాగే 'రుద్ర హోమం' వంటివి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆ తర్వాతే చండీ హోమాన్ని పూర్ణాహుతితో ముగించారు. సాయంత్రం వేళ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని లలితా సహస్రనామ కుంకుమార్చనలు, మహా మంగళహారతి కార్యక్రమాలు జరిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పెద్దలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.



# బన్ని ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలి ...

**కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత పాటిల్ ఐపీఎస్**

**బన్ని ఉత్సవం సంప్రదాయానికి ప్రతీక.. కర్రలతో హింసకు పాల్పడవద్దు.**

**ప్రతి ఒక్కరికీ కుటుంబం, భార్యాపిల్లలు ఉంటారు. హింసకు పాల్పడి వారి భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టవద్దు.**

**అక్రమ మద్యం, నాటుసారా నియంత్రణకు కఠిన చర్యలు.. 190 మందిపై బైండోవర్ చర్యలు.**

**40 కార్డన్ సెర్చ్ ఆపరేషన్లలో 300 కర్రలు స్వాధీనం.**

**50 లీటర్ల అక్రమ మద్యం, నాటుసారా స్వాధీనం.. 300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం.**

**సోషల్ మీడియా, ప్రత్యేక వీడియోల ద్వారా ప్రజలలో చైతన్యం తెచ్చేందుకు అవగాహన సదస్సులు.**

**5 చెక్‌పోస్టులు, 10 పోలీసు పికెట్ల ఏర్పాటు.. విస్తృత తనిఖీలు.**

**110 నైట్ విజన్ సీసీ కెమెరాలు, 700 ఎల్ఈడీ లైట్లు, 10 డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా.**

**అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సహా మొత్తం 1,000 మంది పోలీసులతో పటిష్ట భద్రత.**

**చిన్నపిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.**

**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** దసరా పండుగ సందర్భంగా అక్టోబర్ 21వ తేదీ (బుధవారం) రాత్రి హోళగుంద మండలం దేవరగట్టులో నిర్వహించే శ్రీ మాలమల్లేశ్వర స్వామి బన్ని ఉత్సవాన్ని సంప్రదాయ సంబరంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సోమవారం జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో సహా మొత్తం 1,000 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.బన్ని ఉత్సవం సంప్రదాయబద్ధమైన వేడుక అని, దీనిని కర్రలతో పరస్పరం దాడులు చేసుకునే కార్యక్రమంగా భావించకూడదని ఎస్పీ స్పష్టం చేశారు.దేవుని ముందు నాట్యం, విన్యాసాలు చేసే సంప్రదాయంలో కొందరు వ్యక్తులు మనస్పర్థలు, పాత కక్షల కారణంగా కర్రలతో దాడులకు పాల్పడి గాయాలపాలవుతున్నారని తెలిపారు. ఉత్సవం ముసుగులో ఇతరుల తలలకు గాయాలు చేయడం, హింసకు పాల్పడటం వంటివి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ తో కలిసి కర్నూలు కలెక్టరేట్‌లో, దేవరగట్టులో రెండు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి ఉత్సవ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సమీక్షించినట్లు తెలిపారు.పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో దేవరగట్టు పరిసర గ్రామాలైన నెరణికి, నెరణికి తాండ, కొత్తపేట, అరికెర, ఎల్లార్తి తదితర ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించామన్నారు.గతంలో ఘర్షణలకు పాల్పడినవారిని, అక్రమ మద్యం, నాటుసారా విక్రయదారులను గుర్తించి 190 మందిపై బైండోవర్ చర్యలు తీసుకున్నామన్నారు .దాడుల్లో 40 లీటర్ల నాటుసారా, 10 లీటర్ల అక్రమ మద్యం కలిపి మొత్తం 50 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామన్నారు.అలాగే నాటుసారా తయారీకి సిద్ధం చేసిన 300 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఉత్సవం సందర్భంగా అక్రమ మద్యం, నాటుసారా విక్రయాలు జరగకుండా ప్రత్యేక నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు.దేవరగట్టు పరిసర గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించిన 40 కార్డన్ సెర్చ్ ఆపరేషన్లలో భాగంగా సుమారు 300 కర్రలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.ఉత్సవంలో ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.సోషల్ మీడియా ద్వారా విస్తృత అవగాహన ఉత్సవంలో హింసకు దూరంగా ఉండాలని ప్రజలను చైతన్యవంతం చేసేందుకు సోషల్ మీడియా సహకారంతో ప్రత్యేక అవగాహన వీడియోలను రూపొందించి ప్రచారం చేశామన్నారు.దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో 5 చెక్‌పోస్టులు, 10 పోలీసు పికెట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉత్సవ ప్రాంతంలో 110 నైట్ విజన్ సీసీ కెమెరాలు, 700 ఎల్ఈడీ లైట్లు, 10 డ్రోన్ కెమెరాలతో పాటు కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.ప్రతి ఒక్కరికీ కుటుంబం, భార్యాపిల్లలు ఉంటారని గుర్తుంచుకొని హింసకు పాల్పడవద్దని, పాత కక్షలు, వ్యక్తిగత వివాదాలు, గ్రామాల మధ్య విభేదాలకు తావివ్వవద్దని ఎస్పీ సూచించారు. ఉత్సవానికి వచ్చే చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.నిబంధనలు ఉల్లంఘించి అల్లర్లు, దాడులకు పాల్పడితే కేసుల నమోదు, అరెస్టులు సహా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బన్ని ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, భక్తులు, నిర్వాహకులు పోలీసు యంత్రాంగానికి సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# గ్రామ నాయకులతో ఎమ్మెల్యే బుడ్డా సమావేశం

**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 18:** ఎంపిటిసి అభ్యర్థి స్థానాలకు నామినేషన్ వేసేందుకు పార్టీ శ్రేణులు అందరూ సిద్ధం కావాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశించారు. ఆదివారం రాత్రి బుడ్డా స్వగ్రామమైన వేల్పనూరులో పార్టీ కార్యకర్తలతో నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆదివారం రాత్రి 9 గంటల నుండి అర్ధరాత్రి 12 వరకు పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. గ్రామాల వారిగా ఒక్కొక్కరిని పిలిపించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామాలలో ఉత్సాహం ఉన్న ప్రతి నాయకులు ఎంపీటీసీ అభ్యర్థిత్వానికి నామినేషన్ వేసి తీరాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. గ్రామాలలో ఏదైనా సమస్యలు ఉంటే అందరూ కూర్చొని పరిష్కరించుకొని ఏకాభిప్రాయానికి రావాలని పేర్కొనట్లుగా తెలుస్తోంది. జడ్పిటిసి సభ్యత్వానికి సంబంధించి కూడా చర్చ జరుగుతుందని అందరు ఊహించారు. ఇప్పటికే మండలంలో 8 మంది ఆశావాహులు పోటీ చేసేందుకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. అయితే జడ్పిటిసి సభ్యత్వానికి ఇతర ప్రాంతాల నుండి నాయకులు పోటీ చేసే అవకాశం ఉంటుందని ప్రచారం జరుగుతూ ఉంది. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని జడ్పిటిసి అభ్యర్థిత్వంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. జిల్లాలోని ఓ మంత్రి కి సంబంధించిన సమీప బంధువు ఈ ప్రాంతంలో పోటీ చేస్తారని ఊహాగానాలు వెలువడుతున్నాయి. బండి ఆత్మకూరు కానీ వెలుగోడు మండలం నుంచి కానీ ఇతర ప్రాంత నాయకులు పోటీ చేసే అవకాశం ఉందని కూడా ప్రచారం జరుగుతూ ఉంది.

## కర్నూలు జిల్లా ప్రజలకు, మీడియా కు, పోలీసు అధికారులు, సిబ్బందికి విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

**ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్**

**కర్నూలు పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ పూజ.**

**దుర్గా దేవికి , పోలీసులు వినియోగించే అన్ని రకాల తుపాకులకు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన ... జిల్లా ఎస్పీ దంపతులు**



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ , ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్ జిల్లా ప్రజలకు, మీడియా కు, పోలీసు అధికారులు, సిబ్బందికి సోమవారం దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో సంప్రదాయబద్ధంగా నిర్వహించే ఆయుధ పూజలో ఎస్పీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.పోలీసు ఆయుధాగారంలో పోలీసులు వినియోగించే ప్రతి ఆయుధాన్ని అలంకరించారు.దుర్గాదేవి చిత్రపటానికి, జమ్మిచెట్టుకు, పోలీసు ఆయుధాలకు, పోలీసు వాహనాలకు పూజలు చేశారు.విజయానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయం చేకూర్చాలని, ఆనందంగా దసరా పండుగను జరుపుకోవాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ఐపీఎస్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హుస్సేన్ పీరా, కృష్ణమోహన్, కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, పోలీస్ వెల్ఫేర్ డాక్టర్ స్రవంతి , సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో జరిగేలా సహకరించాలి



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 19 (నంది పత్రిక):** రుద్రవరం మండలంలో త్వరలో నిర్వహించనున్న ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఆయా పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏడిఏ డాక్టర్ మనోరంజన ప్రతాప్, ఎన్నికల అధికారి ఎంపీడీవో భాగ్యలక్ష్మి ఆయా పార్టీల ప్రతినిధులను కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం ఎన్నికల నిర్వహణపై ఆయా పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అధికారులు సమావేశం నిర్వహించారు. ఈనెల 21వ తేదీ నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని, నవంబర్ మూడో తేదీ ఎన్నికల పోలింగ్ జరుగుతుందని, ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల నిర్వహణకు సంబంధించి గ్రామాలలో ఆయా పార్టీల తరఫున పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఆయా పార్టీల ప్రతినిధులు ఎన్నికల షెడ్యూల్ మరియు నిబంధనలను గమనించి గ్రామాలలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎన్నికల నిర్వహణ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఎన్నికల అధికారి కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో బాలాంజనేయులు, ఏవో సుబ్రహ్మణ్యం, టిడిపి జనసేన వైసిపి నాయకులు, కార్యకర్తలు, పోలీసులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ జడ్పిటిసి నామినేషన్ల సామాగ్రి సిద్ధం .

**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 19 (నంది పత్రిక):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎంపీటీసీ జడ్పిటిసి నామినేషన్ల సామాగ్రి సిద్ధం చేసినట్లు మండల ఎన్నికల అధికారి ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. రుద్రవరం మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలు 1 జడ్పిటిసి స్థానానికి ఈనెల 21వ తేదీ నుండి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని ఇందుకు సంబంధించిన ఎన్నికల సామాగ్రి సిద్ధం చేశామని ఆమె తెలిపారు. జిల్లా కేంద్రం నుండి వచ్చిన ఎన్నికల సామాగ్రిని ఎంపిటిసిల వారిగా సిబ్బంది సిద్ధం చేశారన్నారు. ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి నామినేషన్ వేసే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు బాలాంజనేయులు, ప్రసాద్ రెడ్డి, ఏవో సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్ హరికిషన్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



# ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికల షెడ్యూల్ వివరాలు నోటీస్ బోర్డ్ పై ప్రదర్శన




**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 19 (నంది పత్రిక):** రుద్రవరం మండలంలో త్వరలో నిర్వహించనున్న ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల షెడ్యూల్ వివరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డుపై సోమవారం అధికారులు ప్రదర్శించారు. ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉత్తర్వుల మేరకు మండల పరిధిలోని ప్రజలు ఓటర్లు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమాచారం కొరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మండల ప్రత్యేక అధికారి ఏడిఏ మనోరంజన్ ప్రతాప్, ఎన్నికల అధికారి ఎంపీడీవో భాగ్యలక్ష్మి డిప్యూటీ ఎంపీడీవోలు ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ షెడ్యూల్ వివరాలను నోటీసు బోర్డు పై అతికించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి చే ఎంపీటీసీ జడ్పిటిసి ఓటర్ల జాబితాను ఈనెల 21 తేదీ ప్రదర్శించడం జరుగుతుందని అదే రోజు నుండి ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని, నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ 23వ తేదీ సాయంత్రం 5:00 వరకు ఉంటుందని ఎన్నికల అధికారులు తెలిపారు. 24వ తేదీ (ఉదయం 8 గంటల నుండి) నామినేషన్ల పరిశీలన ఉంటుందని, 25వ తేదీ తిరస్కరించబడిన నామినేషన్లపై అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉంటుందని, ఎంపీటీసీల కొరకు ఆర్డిఓ కు, జడ్పిటిసి లకు జిల్లా కలెక్టర్కు అప్పీలు చేసుకుని పరిష్కరించుకోవచ్చని తెలిపారు. 26వ తేదీ అప్పిలేట్ అధికారిచే అప్పిల పరిష్కారం ఉంటుందన్నారు. 27వ తేదీ అభ్యర్థుల ఉపసంహరణ మధ్యాహ్నం 3 గంటల లోపుగా ఉంటుందని, అలాగే అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీ చేయు అభ్యర్థుల తుది జాబితా ప్రచురణ ఉంటుందన్నారు. నవంబర్ 3వ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహణ ఉంటుందన్నారు. ఏదైనా పోలింగ్ కేంద్రాలలో రీపోలింగ్ ఉన్నట్లయితే నాలుగో తేదీ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. 5వ తేదీ ఓట్ల లెక్కింపు ఉంటుందని లెక్కింపు పూర్తయిన వెంటనే ఫలితాలు వెల్లడించడం జరుగుతుందని తెలిపారు. ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికల నిర్వహణ సందర్భంలో రుద్రవరం మండల పరిధిలోని ప్రజలు పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఈ ఎన్నికల షెడ్యూల్ మరియు నిబంధనలను గమనించి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎన్నికల అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది ఉన్నారు.

# శ్రీ కాత్యాయని దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



**వెలుగోడు అక్టోబర్ 19 (నంది పత్రిక):** వెలుగోడు పట్టణంలోని స్థానిక అమ్మవారి శాలలో దేవి శరన్నవరాత్రుల వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా తొమ్మిదవ రోజైన సోమవారం అమ్మవారు శ్రీ కాత్యాయని దేవి అవతారంలో భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం కలశ స్థాపన, రుద్రాభిషేకం, షోడశోపచార పూజలు, కుంకుమార్చన మరియు శాశ్వత సామూహిక పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఉభయదాతలు శ్రీ రాచమడుగు రత్మయ్య శ్రేష్ఠి - పుల్లమ్మ దంపతులు, శ్రీ మాళెపాటి వెంకటరమణయ్య శ్రేష్ఠి - నాగమణి దంపతులు పాల్గొన్నారు. రాత్రి 7.00 గంటలకు ప్రత్యేక పూజలు, అనంతరం 8.00 గంటలకు భక్తులకు ప్రసాద వితరణ జరిగింది ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృప పొందారు.

# వక్కి లేరు వాగులో ప్రమాదవశాత్తు పడ్డ ట్రాక్టర్.

**తప్పిన ప్రమాదం.**



**రుద్రవరం ప్రతినిధి అక్టోబర్ 19 (నంది పత్రిక):** మండలంలోని చిలకలూరు గ్రామ సమీపంలో ఉన్న వక్కిలేరు వాగులో ట్రాక్టర్ ప్రమాదవశాత్తు పడటంతో ట్రాక్టర్,డ్రైవర్ చాకచకంగా బయటకు దూకడంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకెళ్తే సోమవారం బత్తలూరు గ్రామానికి చెందిన వ్యక్తి చిలకలూరు వక్కిలేరు వాగులో ట్రాక్టర్ శుభ్రం చేసుకోవడానికి వచ్చి అనుకోకుండాఅదే వాగులో ఉన్న గుంతలో ట్రాక్టర్ బోల్తా పడుతున్న సమయంలో డ్రైవర్ పక్కకు దూకడంతో డ్రైవర్ ప్రమాదం నుండి బయటపడ్డారు. అనంతరం గ్రామస్తులు సహాయంతో వాగులో ఉన్న ట్రాక్టర్ నుజెసిబి తో బయటికి తీశారు. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ ఊపిరి పిలుచుకున్నారు.



## స్థానిక ఎన్నికలే లక్ష్యంగా వైసీపీ సమావేశం.. జడ్పీటీసీ అభ్యర్థిగా చంద్ర యాదవ్ ఎంపిక



**పోరుమామిళ్ల, అక్టోబర్ 19 ( నంది పత్రిక):** బద్వేల్ నియోజకవర్గంలోని కాశినాయన మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాశినాయన మండల జడ్పీటీసీ అభ్యర్థిగా చంద్ర యాదవ్‌ను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, నియోజకవర్గ యువ నాయకుడు, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ సన్నద్ధత, పార్టీ బలోపేతం, క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, పార్టీ ఆశయాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో ముందుకు సాగుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు.

## కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్న మంత్రి టీజీ భరత్



**కర్నూలు సిటీ నంది పత్రిక** రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ కుటుంబ సమేతంగా కర్నూలులోని చిన్న అమ్మవారిశాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్లూరులోని అమ్మవారిశాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మంత్రి టీజీ భరత్‌ను ఘనంగా సన్మానించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి ఆకాంక్షించారు.

## మంత్రి టీజీ భరత్ సమక్షంలో టీడీపీలో చేరిన పలువురు వైసీపీ నాయకులు

### పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపు



**కర్నూలు సిటీ నంది పత్రిక**కర్నూలు నగరంలో తెలుగుదేశం పార్టీకి మద్దతు పెరుగుతోంది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై పలువురు టీడీపీకి మద్దతుగా నిలుస్తున్నారు. నగరంలోని 8వ వార్డుకు చెందిన షేక్ షా, నజీర్‌లు వైఎస్సార్‌సీపీని వీడి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న నగరపాలక సంస్థ ఎన్నికల్లో 8వ వార్డు టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి షేక్ నిలోఫర్ విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు. అలాగే కర్నూలు నగరంలోని ధర్మపేటకు చెందిన వీరేష్ తన అనుచరులతో కలిసి మంత్రి టీజీ భరత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ధర్మపేటకు చెందిన టీడీపీ కార్పొరేటర్ అభ్యర్థి సురేంద్ర గెలుపు కోసం తన అనుచరులతో కలిసి కృషి చేయాలని మంత్రి.. వీరేష్‌కు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ, పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కర్నూలు నగర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తూ, ప్రజల ఆదరణతో ఎన్నికల్లో విజయాన్ని సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమిశెట్టి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు.. టీడీపీకి షాక్.

### ఓర్వకల్లు మండలం లొద్దిపల్లెలో 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక.

**కర్నూల్ సిటీ నంది పత్రిక** పాణ్యం నియోజకవర్గం: ఓర్వకల్లు మండలం లొద్దిపల్లె గ్రామంలో తెలుగుదేశం పార్టీకి చెందిన శాపురి శ్రీనివాసులు, శాపురి పెద్దయ్య, కురువ శ్రీరాములు,డబ్బుల ఎల్లస్వామి,ఉలువల కృష్ణుడు, నేశా పుల్లయ్య, చాకలి మద్దిలేటి, షేక్ నూర్ అహమ్మద్,శాపురి భారత్, ఉలువల మధు,కోర్రు మధు మొత్తం 30 కుటుంబాలు గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి మరియు వైఎస్ఆర్సిపి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాటసాని శివ నరసింహారెడ్డి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కాటసాని రామభూపాల్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎన్నికల వేళ గ్రామంలో చోటుచేసుకున్న ఈ చేరికలతో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం అవుతుందని స్థానిక నాయకులు ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతో పార్టీలో చేరుతున్న ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని నాయకులు తెలిపారు.



## పాణ్యం నియోజకవర్గ శాసన సభ్యురాలు గౌరు చరితరెడ్డి కుటుంబ సభ్యుల సమక్షంలో 41 వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థికి బి ఫామ్ అందజేత



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ పరిధిలో గల 41 వ వార్డు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పూల శివ శంకరుకు పాణ్యం నియోజకవర్గ శాసన సభ్యురాలు గౌరు చరితారెడ్డి సమక్షంలో సోమవారం శాసన సభ్యురాలు ఆరోరా నగర్ పార్టీ కార్యాలయం దగ్గరకు 41వ వార్డు టిడిపి నాయకులు శేఖర్ చౌదరి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని పాణ్యం నియోజకవర్గం శాసనసభ్యులు గౌరు చరితారెడ్డి మరియు జనార్ధన్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ 41 వార్డు కార్పొరేటర్ అభ్యర్థి కి బి ఫామ్ ను పూల శివశంకరుకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 41వ వార్డు టిడిపి నాయకులు గుమ్మళ్ళ అయ్యపురెడ్డి, మాజీ ఎం.పి.టి.సి ఆంజనేయులు, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ కూరపాటి దేవేందర్ రెడ్డి, టిడిపి నాయకులు శేఖర్ చౌదరి, కల్లూరు సింగల్ విండో డైరెక్టర్ అంగడి లక్ష్మన్న యాదవ్, టీడి పి నాయకులు కురువ ఎల్లప్ప, సీనియర్ టిడిపి నాయకులు నాగరాజు, జింగిరి వెంకటేశ్వర్లు, టేక్ నాయుడు, తదితరులు టిడిపి నాయకులు పాల్గొని పార్టీ బీఫామ్ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పోలీసు స్టేషన్లో దసరా పూజలు



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ నందు ఎస్ఐ జయశేఖర్ ఆధ్వర్యంలో గ్రామ పురోహితుడు యాదవేని లక్ష్మీ నరసయ్య శర్మ సోమవారం దసరా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుధ పూజ, దేవతా మూర్తులకు కుంకుమార్చన. పుష్పార్చన, బిల్వార్చన, మంగళహారతీ వంటి విశేష పూజాక్రతవులను, వేధ మంత్రోశ్చరణలతో నిర్వహించారు. పోలీస్ స్టేషన్ గుమ్మానికి మామిడి తోరణాలు కట్టీ, గుమ్మడి కాయలో కర్పూరం వెలిగించి హారతి ఇచ్చి పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏస్ఐ రామ్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ రవీంద్ర బాబు, సిబ్బంది ఉన్నారు.

## 24వ వార్డులో ముమ్మరంగా వైఎస్సార్‌సీపీ ప్రచారం



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని 24వ వార్డులో వైఎస్సార్‌సీపీ ప్రచారం ఉత్సాహంగా కొనసాగుతోంది. కార్పొరేటర్ అభ్యర్థి నల్లబోలు మమత , కర్నూలు మేయర్ అభ్యర్థి సుశీల కుమారుడు భార్గవ్ గాంధీ , వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లబోలు మమత ప్రజలను కలిసి, టీడీపీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని వివరిస్తూ, ప్రజలు తమ సమస్యలను, అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలాగే వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి తమకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు వార్డులోని ప్రజలను కలుస్తూ ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించండి: రిటర్నింగ్ అధికారి హిరా నాయక్



**వెలుగోడు అక్టోబర్ 19 నంది పత్రిక:** మండల పరిషత్ ఎన్నికలను ప్రశాంతంగా మరియు పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో సహకరించాలని వెలుగోడు మండల రిటర్నింగ్ అధికారి (ఆర్వో) హిరా నాయక్ పిలుపునిచ్చారు. సోమవారం వెలుగోడు తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీడీవో మురారితో కలసి ఆయన వివిధ రాజకీయ పార్టీల నేతలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ... నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) మరియు ప్రచారంలో పాటించాల్సిన కీలక నిబంధనలపై నాయకులకు సమగ్రంగా వివరించారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు ముగిసేలా నాయకులు తమ కార్యకర్తలకు తగిన సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల నోటిఫికేషన్ ప్రచురణ



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలక సంబంధించిన నోటిఫికేషన్ ప్రతులను సోమవారం మండల అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి మేరి. ప్రచురించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి నోటిఫీన్ లో ఈ నెల 21 నుంచి 23 వతేదివరకు ఎంపీడీఓ కార్యాలయం నందు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరణ ప్రక్రియ ఉంటుందన్నారు. 24న నామినేషన్ల పరిశీలన, 25న తిరస్కరించిన నామినేషన్లపై అప్పిలు చేయుట, 26న ఎన్నికల అధికారి తిరస్కరణ నామినేషన్లపై తుది నిర్ణయం, 27న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం ఎంపీటీసీ, జెడీపటీసీ పదవులకు పోటీ చేయు అభ్యర్థుల పేర్లు నోటీస్ బోర్డులో ప్రకటన చేయుట వంటి ప్రక్రియ జరుగుతాయన్నారు. అదేవిధంగా నవంబర్ 3 వ తేదిన ఓటర్ల పోలింగ్ ప్రక్రియ, 4వ తేదిన అవసరమైన చోట ఎన్నికల అధికారీ అనుమతితో రీపోలింగ్ నిర్వహణ, 5వ తేదిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓట్ల లెక్కింపు, ఆ వెంటనే ఫలితాల ప్రకటన తరువాత గెలిచిన అభ్యర్తులకు ఎన్నికల అధికారిచే ధృవీకరణ పత్రం అందజేసే ప్రక్రియ జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఎన్నికలు సజావుగా జరిగేందుకు అధికారులకు సహకరించాలని ఆమె కోరారు. ఆమెతో పాటు సచివాలయాల డీప్యూటీ ఎంపీడీఓ కె.పీ.ఆర్.శర్మ, సీఏ సలీమ్ ఉన్నారు.

## నామినేషన్ ప్రక్రియను సజావుగా సాగేందుకు సహకరించాలి

### - ఎన్నికల రిటర్నింగ్ అదికారి ఎం.వి. శివారెడ్డి



**కొత్తపల్లి - నంది పత్రిక :** జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే ప్రక్రియను సజావుగా సాగేందుకు సహకరించాలని మండల ఎన్నికల రిటర్నింగ్ అదికారి ఎం.వి. శివారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని వివిధ పార్టీల నాయకులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు నామినేషన్ వేసేటప్పుడు సరైన పత్రాలను కలిగి ఉండాలన్నారు. నామినేషన్ ప్రక్రియను గురించి క్షుణ్ణంగా వివరించారు. ఏమేమి పత్రాలు కావాలి అన్న విషయాలను వివరించారు. నామినేషన్ సమయంలో ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా పార్టీలకు చెందిన ప్రతినిదులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, డీప్యూటీ ఎంపీడీఓ సుబ్బారావు. తదితరులు పాల్గొన్నారు.



## సిద్ధిధాత్రి అమ్మవారుగ శ్రీ చౌడేశ్వరి అమ్మవారు





**బనగానపల్లె అక్టోబర్ 19నందిపత్రిక** నందవరం శ్రీ చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు శరన్నవరాత్రి మహోత్సవములలో 9 వ రోజు సిద్ధిధాత్రి అమ్మవారుగ చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఉదయాన్నే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి ప్రాతః కాలాది విశేష పూజ,అష్టైశ్వర్య మహా మంగళ నిరాజనం తీర్థ ప్రసాద వినియోగం చేయడం జరిగింది. అనంతరం యాగశాల నందు చండీపారాయణశీ, వేదపారాయణం, రుద్రపారాయణశీ చెయ్యడం జరిగినది. అదేవిధం గా సాయంత్రం ప్రకార రథోత్సవం నిర్వహించడం జరిగినది. భక్తులకి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ఎన్ . శ్రీనివాస రెడ్డి , ఆలయ చైర్మన్ పి వి నాగార్జున రెడ్డి , ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి వి కుమార్ రెడ్డి పర్యవేక్షిన్చారు.

## క్వాంటమ్ ప్రపంచంలో కొత్త ఆవిష్కరణ.. 'ఫ్రాక్షనల్ ఫెర్మి సముద్రం' గుర్తింపు

భౌతిక శాస్త్రంలో శాస్త్రవేత్తలు ఒక కీలకమైన ముందడుగు వేశారు. పదార్థం యొక్క అసాధారణమైన, సరికొత్త క్వాంటమ్ స్థితిని విజయవంతంగా గుర్తించారు. 'ఫ్రాక్షనల్ ఫెర్మి సముద్రం' (ఖీతీుఛ్టిుశీఅుశ్రీ ఖీవతీఎఱ ూవఱ) అని పిలుస్తున్న ఈ వింత దశను కనుగొన్నట్లు హన్స్-క్రిస్టోఫ్ నేగెర్ల్ నేతృత్వంలోని పరిశోధకుల బృందం ప్రకటించింది. ఈ పరిశోధన వివరాలు ప్రతిష్ఠాత్మక 'ఫిజికల్ రివ్యూ లెటర్స్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

## శ్రీశైలం దేవస్థానంలోరాష్ట్ర ప్రభుత్వంచే పట్టువస్త్రాల సమర్పణ



**శ్రీశైలం అక్టోబరు19(నంది పత్రిక)** దసరా మహోత్సవాలను పురస్కరించుకుని (19.10.2026) సాయంకాలం శ్రీస్వామిఅమ్మ వార్లకు, రాష్ట్ర ప్రభుత్వం తరుపున రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు గౌరవ మంత్రివర్యులు శ్రీ బి.సి. జనార్ధన్ రెడ్డి, స్థానిక గౌరవ శాసనసభ్యులు శ్రీ బుడ్డా రాజశేఖరరెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సమర్పణ కార్యక్రమములో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ఎ.వి.రమణ,శ్రీ చిట్టిబొట్ల భరద్వాజ్ శర్మ , శ్రీమతి కోడె కాంతివర్ధిని , శ్రీ చిలువేరు కాశీనాథ్, శ్రీ మేడా మురళీధర్, శ్రీమతి జిళ్లెల శ్రీదేవి, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ కట్టా సుధాకర్ రెడ్డి, శ్రీ ఆకుల శ్రీనివాసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి ఆలయ మహాద్వారం వద్ద వస్త్ర సమర్పణ సంకల్పం, వస్త్రాలకు పూజాదికాలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. అనంతరం మంత్రివర్యులు మరియు స్థానిక శాసనసభ్యులవారు మేళతాళాలతో ఆలయ ప్రవేశం చేసి స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పించారు. కాగా ఎంతో చారిత్రక ప్రసిద్ధి పొందిన శ్రీశైలక్షేత్రంలో ఎందరో చక్రవర్తులు, రాజులు, రాజకుటుంబీకులు మొదలైన వారు ఆయా ఉత్సవ సందర్భాలలో శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించేవారని ప్రతీతి. ఈ సంప్రదాయాన్ని అనుసరించే రాష్ట్ర ప్రభుత్వం ఏటా మహాశివరాత్రి మరియు దసరా మహోత్సవాలలోనూ శ్రీ స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను అనవాయితీగా సమర్పిస్తోంది.



## ఏలూరులో జిల్లా ఇంచార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటన..

### - ఘన స్వాగతం పలికిన జనసేన నేతలు..



**ఏలూరు బ్యూరో చీఫ్, అక్టోబర్ 19: నంది పత్రిక-** స్థానిక సంస్థల ఎన్నికల సమావేశం నిమిత్తం ఏలూరుకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి వర్యులు , ఏలూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి , నాదెండ్ల మనోహర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు (చిన్నబాబు) ఉంగుటూరు శాసనసభ్యులు పట్సమట్ల ధర్మరాజు , ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడు , ఏలూరు జనసేన నాయకులు నారా శేషు ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హోటల్ ఎన్ వద్ద ఘన స్వాగతం పలికారు.. ఈ కార్యక్రమం లో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు..

## టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు: 20 రోజులుగా ముంబైలో మకాం, ఫుట్‌బాల్ మైదానం వద్ద రెక్కీ

బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ప్రయాణిస్తున్న కారుపై కాల్పుల ఘటనకు సంబంధించి పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను రాజస్థాన్‌లోని కోట రైల్వే స్టేషన్‌లో అరెస్ట్ చేశారు. దాడికి దాదాపు 20 రోజుల ముందే నిందితులు ముంబైకి చేరుకొని, పక్కా ప్రణాళికతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. వారం రోజుల క్రితం టైగర్ ష్రాఫ్ ఆడుకుంటున్న ఫుట్‌బాల్ మైదానం వద్దకు వెళ్లి రెక్కీ కూడా నిర్వహించినట్లు గుర్తించారు.అరెస్టయిన వారిలో హర్యానాకు చెందిన ఫుల్‌సింగ్ నరేశ్, రెహాన్ రషీద్దీన్‌తో పాటు ముంబైలో నివసిస్తున్న హృతిక్ అనే రాపిడో డ్రైవర్ ఉన్నారు. వీరిలో హృతిక్ బైక్ నడపగా, మిగిలిన ఇద్దరు కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబర్ 11న వీరు ఒక మోటార్‌సైకిల్‌ను కొనుగోలు చేసినట్లు కూడా విచారణలో వెల్లడైంది. కాల్పుల అనంతరం పోలీసులను తప్పుదోవ పట్టించేందుకు నిందితులు వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ముందుగా బైక్‌పై అంధేరీ రైల్వే స్టేషన్‌కు వెళ్లి, అక్కడి నుంచి లోకల్ ట్రైన్‌లో కాందివలీకి చేరుకున్నారు. ఆ తర్వాత క్యాబ్ బుక్ చేసుకొని సూరత్‌కు పారిపోయారు. అక్కడి నుంచి కోటా వెళుతున్న పుణే-జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కగా, పక్కా సమాచారంతో కోటా పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కోటా ఎస్పీ తేజస్విని గౌతమ్ ప్రకారం, కేవలం 15 నిమిషాల్లో ఆపరేషన్ పూర్తి చేసి నిందితులను పట్టుకున్నారు. తొలుత ఢిల్లీ వెళ్లి, అక్కడి నుంచి నేపాల్‌కు పారిపోవాలని నిందితులు పథకం రచించినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది.

## సంగమేశ్వరంలో తొలి సోమవారపు పూజలు



**కొత్తపల్లి -నంది పత్రిక :** శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం తగ్గడంతో సప్తనదీ తీరంలోని ప్రాచీన సంగమేశ్వ రాలయం పూర్తిగా బయటపడింది. దీంతో సంగమేశ్వర స్వామికి తొలి సోమవారపు విశేష పూజా క్రతువులు ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ నిర్వహిచారు. ప్రాచీన సంగమేశ్వరాలయ గర్భాలయంలోని వేపధారు శివలింగాన్ని పూలమాలతో అలంకరించారు. అనంతరం వేపధారు శివలింగానికి కృష్ణాజలాలతో అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన వంటి ప్రత్యేక పూజాక్రతువులను నిర్వహించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### వై. నాగేశ్వరరావు యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్



**డోన్ నంది పత్రిక, అక్టోబర్ 19** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అఖండ విజయం సాధించే దిశగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని డీసీఎంఎస్ చైర్మన్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు యాదవ్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం ప్యాపిలి పట్టణంలోని షాదీఖానాలో మండలానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలను చేపడుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఆయా వర్గాల అభ్యున్నతికి పలు చర్యలు తీసుకుంటోందని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ, ప్రతి వార్డులోనూ ప్రజలను కలుసుకుని ప్రభుత్వ పనితీరును వివరించాలని సూచించారు.గత వైసీపీ పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన విమర్శించారు. గత పాలనలో జరిగిన పరిణామాలను ప్రజలకు వివరిస్తూనే, ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేయాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో అఖండ విజయం సాధించేందుకు కృషి చేయాలని వై. నాగేశ్వరరావు యాదవ్ కోరారు.

## శ్రీశైలం దేవస్థానంలోక్యాలెండర్ల ఆవిష్కరణ





**శ్రీశైలం అక్టోబరు19(నంది పత్రిక)** దేవస్థానం ప్రచురించిన 2027వ సంవత్సరపు రెండు రకాల 12 షీట్ల క్యాలెండర్లు, సింగిల్ షీట్ పంచాంగం క్యాలెండరు మరియు టేబుల్ క్యాలెండరు, 6 షీట్లతో కూడిన క్యాలెండర్లను (మొత్తం 5 రకాల క్యాలెండర్లు) సాయంత్రం (19.10.2026) అమ్మవారి ఆలయంలోని ఆశీర్వచనమండపములో ఆవిష్కరించ బడ్డాయి. ఈ క్యాలెండర్లను రాష్ట్ర రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు గౌరవ మంత్రివర్యులు శ్రీ బి.సి. జనార్ధన్ రెడ్డి స్థానిక గౌరవ శాసనసభ్యులు బుడ్డారాజశేఖరరెడ్డిగారు ఈ సాయంత్రం ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమములో ధర్మకర్తల మండలి అధ్యక్షులు శ్రీ పోతుగుంట రమేష్ నాయుడు, కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ఎ.వి.రమణ,శ్రీ చిట్టిబొట్ల భరద్వాజ శర్మ , శ్రీమతి కోడె కాంతివర్ధిని , శ్రీ చిలువేరు కాశీనాథ్, శ్రీ మేడా మురళీధర్, శ్రీమతి జిళ్లెల శ్రీదేవి, ప్రత్యేక ఆహ్వానితులు శ్రీ కట్టా సుధాకర్ రెడ్డి, శ్రీ ఆకుల శ్రీనివాసులు పాల్గొన్నారు.

కాగా రాబోవు సంవత్సర క్యాలెండర్లను ప్రతీ సంవత్సరము దసరా మహోత్సవాలలో ఆవిష్కరించడం ఆనవాయితి. కాగా పెద్ద సైజు 12షీట్ల క్యాలెండరులో శ్రీసాక్షిగణపతి, శ్రీమల్లికార్జునస్వామివారు, శ్రీభ్రమరాంబా దేవిఅమ్మవారు, శ్రీసోమాస్కందమూర్తి ( కల్యాణమూర్తులు ) శ్రీ ఉమామహేశ్వరస్వామి వారు, శ్రీ అన్నపూర్ణాదేవి అమ్మవారు, శ్రీ వృద్ధమల్లికార్జునస్వామివారు, శ్రీ సహస్రలింగేశ్వరస్వామివారు, శ్రీ రాజరాజేశ్వరస్వామివారు, శ్రీరాజరాజేశ్వరదేవి అమ్మవారు, శ్రీ బయలువీరభద్రస్వామివారు, శ్రీ శనగల బసవన్నస్వామివార్ల ఛాయాచిత్రాలను ముద్రించబడ్డాయి. అలాగే 12 షీట్ల మీడియం క్యాలెండర్‌లో శ్రీ కాంస్య గణపతి, శ్రీ సాక్షిగణపతివారు, శ్రీమల్లికార్జునస్వామివారు, శ్రీభ్రమరాంబాదేవిఅమ్మవారు, శ్రీ హాటకేశ్వరస్వామివారు, శ్రీ శిఖరేశ్వరస్వామివారు, శ్రీ ఆరామవీభద్రస్వామివారు, శ్రీ వీరభద్రస్వామివారు,

శ్రీ అంకాళమ్మ అమ్మవారు, శ్రీ మోక్షలింగేశ్వరస్వామివారు, శ్రీ కౌమారీదేవి అమ్మవారు, శ్రీ నటరాజస్వామివారు, శ్రీ నందీశ్వరస్వామివారి ఛాయచిత్రాలను ముద్రించడం జరిగింది. అదేవిధంగా టేబుల్‌క్యాలెండరులో ఆయా దేవతామూర్తుల చిత్రాలను ప్రచురించబడ్డాయి. అలాగే 6 షీట్ల పంచాంగం క్యాలెండరు మరియు సింగిల్ షీట్ పంచాగం క్యాలెండర్లు ముద్రించబడ్డాయి. ఈ క్యాలెండర్లలోని పంచాంగ వివరాలను దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి శ్రీ పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ వారు రూపొందించారు. ఈ క్యాలెండర్‌లోని ఛాయచిత్రాలను ప్రఖ్యాత ఫోటోగ్రఫీ నిపుణులైన శ్రీ బి. శ్రీధరరాజు, ప్రాక్సిస్ స్టూడియో వారు చిత్రీకరించి రూపొందించారు.

## విజయదశమి పర్వదిన సందర్బంగా జిల్లా ప్రజ లకు, పోలీస్ సిబ్బందికి, మీడియా మిత్రులకు శుభాకాంక్షలు

### జిల్లా ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్



**కడప అక్టోబర్ 19 (నంది పత్రిక రిపోర్టర్)**విజయ దశమి పర్వ దినాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్ పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ప్రజలకు, పోలీ స్ సిబ్బందికి, మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలిపారు.చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకునే విజయదశమి వేడుకను ఇంటిల్లిపాదీ ఆనందో త్సాహాలతో జరుపు కోవాలని జిల్లా ఎస్ పి ఆకాంక్షించారు. ఈ దసరా పండుగ అందరికీ విజయా లు చేకూర్చాలని, చేపట్టిన ప్రతీ కార్యం సఫలీకృతం కావాలని కోరు టుంటు న్నట్లు తెలిపారు. ప్రజలకు అమ్మవారి అనుగ్రహంఎల్ల వేళలా ఉండాలని, అన్ని వర్గాలవారు సుభిక్షంగా, సుఖ సంతోషాలతో జీవించాలని అభి లషించారు

## డోన్ మున్సిపల్ చైర్మన్ పదవికి 2, వార్డుల్లో 2 నామినేషన్లు తిరస్కరణ



**డోన్ - నంది పత్రిక అక్టోబర్ 19** డోన్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. చైర్మన్ పదవికి మొత్తం 13 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, వాటిలో 2 నామినేషన్లను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. దీంతో చైర్మన్ పదవికి పోటీలో ఉన్న అభ్యర్థుల సంఖ్య 11కు తగ్గింది. అదేవిధంగా, డోన్ మున్సిపాలిటీలోని 36 వార్డులకు సంబంధించి మొత్తం 220 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలన అనంతరం రెండు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 17వ వార్డు, 26వ వార్డులకు సంబంధించిన నామినేషన్లను అధికారులు తిరస్కరించినట్లు సమాచారం. దీంతో వార్డు అభ్యర్థుల సంఖ్య 218కు చేరింది.నామినేషన్ల పరిశీలన సందర్భంగా అభ్యర్థులు సమర్పించిన పత్రాలు, ప్రతిపాదకుల వివరాలు, ఇతర అర్హతలను అధికారులు పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా లేని నామినేషన్లను తిరస్కరించినట్లు తెలుస్తోంది. తిరస్కరణకు గురైన నామినేషన్లపై అభ్యర్థులకు సమాచారం అందించినట్లు అధికారులు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసిన అనంతరం తుది అభ్యర్థుల జాబితాను అధికారులు ప్రకటించనున్నారు. అనంతరం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత రానుంది. డోన్ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రచారం, అభ్యర్థుల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు మరింత వేగం పుంజుకునే అవకాశం ఉంది.

## బద్వేల్ మున్సిపల్ చైర్మన్ గా దివ్య తేజ ఏకగ్రీవ ఎన్నిక



**కడప అక్టోబర్ 19 (నంది పత్రిక రిపోర్టర్)**కడప జిల్లా బద్వేల్ మున్సిపాలిటీకి నూతన చైర్మన్ ఎన్నిక పూర్తయింది.బద్వేల్ మున్సిపల్ చైర్మన్ గా దివ్య తేజ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఎన్నిక అనంత రం ఆమెకు టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు శు భాకాంక్షలు తెలిపారు.

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రశంసలు..!



### ఎన్నికల నిర్వహణలో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచనలు

**కడప, బ్యూరో చీప్ అక్టోబరు 19: నంది పత్రిక** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాలో నెలకొన్న పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటూ, జిల్లా యంత్రాంగం తక్షణమే చేపట్టిన చర్యలకు గాను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా అభినందించారు. సోమవారం సాయంత్రం రాష్ట్ర రాజధాని నుంచి.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కడప కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, తోపాటు.. ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకుడు గణేష్ కుమార్, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా హాజరయ్యారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో అర్బన్ లోకల్ బాడీ ఎన్నికల ప్రక్రియలో మైదుకూరులో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో.. జిల్లా యంత్రాంగం తక్షణం తీసుకున్న నిర్ణయాలు, వెంటనే పోలీస్ యంత్రాంగంతో కలిసి నామినేషన్ కేంద్రాలను పరిశీలించింది. ఎన్నికల కమిషన్ నిబంధనలు ఉల్లంఘించి, రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడిన 10 మందిని గుర్తించి అరెస్టులు, కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటి చర్యలల్లో జిల్లా యంత్రాంగం సమయస్ఫూర్తికి రాష్ట్ర ఎన్నికల కమీషనర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ "గుడ్ వర్క్ డన్" అని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రశంసించారు. జిల్లా యంత్రాంగం, పోలీసు యంత్రాంగం తక్షణ స్పందన, సమన్వయ తీరు అభినందనీయం అన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అన్ని జిల్లాల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను తీసుకుంటూ, భద్రతాపరమైన చర్యలను మరింత పటిష్టంగా కొనసాగించాలని సూచించారు.ఇటీవల పూర్తయిన నామినేషన్ల ప్రక్రియ, త్వరలో జరగనున్న పోలింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై చర్చించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటిస్తూ, ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.కడప వంటి సున్నితమైన జిల్లాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన అదనపు పోలీసు బలగాలను ఇతర ప్రాంతాల నుంచి సమకూర్చుకోవాలని, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు తెలియజేయాలని, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఓటర్లలో నమ్మకాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, సంబంధిత ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## హైదరాబాద్‌లో ఫేక్ నంబర్ ప్లేట్లపై ఉక్కుపాదం.. 100 వాహనాలు సీజ్

హైదరాబాద్ నగరంలో నకిలీ, ట్యాంపర్ చేసిన నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. వాహనాల గుర్తింపును దాచిపెట్టడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్న వారిని కట్టడి చేసేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గత 8 నెలల్లో 100 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 100 క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నకిలీ నంబర్ ప్లేట్ల వినియోగంపై ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ స్పెషల్ డ్రైవ్‌ను ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 88 ద్విచక్ర వాహనాలు, 12 నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో పారదర్శకతకు పెద్దపీట వేయాలి..!

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి నామినేషన్ పత్రాలను వెంటనే స్కాన్ చేసి భద్రపరచాలి

## జాప్యం లేకుండా అభ్యర్థులకు ధ్రువపత్రాలు జారీపై దృష్టి పెట్టాలి

**కడప, బ్యూరో చీఫ్ అక్టోబరు 19 నంది పత్రిక:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు, అవకతవకలకు తావులేకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకుడు గణేష్ కుమార్ తో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సంబంధిత రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు పాల్గొన్నారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా ప్రతి నామినేషన్ కేంద్రంలో స్కానర్లు ఏర్పాటు చేయాలని, అభ్యర్థులు పత్రాలు సమర్పించిన వెంటనే వాటిని స్కాన్ చేసి డిజిటల్ రూపంలో భద్రపరిచిన తర్వాతే స్వీకరణ రసీదు అందించాలని సూచించారు. అభ్యర్థులకు అవసరమైన ధ్రువపత్రాలను ఎలాంటి జాప్యం లేకుండా జారీ చేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.

**నామినేషన్ పత్రాల భద్రతకు ప్రత్యేక చర్యలు**

నామినేషన్ పత్రాలు మాయమవడం, ఇతరులు తీసుకెళ్లడం వంటి ఘటనలకు అవకాశం లేకుండా అన్ని నామినేషన్ కేంద్రాల్లో స్కానర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలను సిద్ధం చేసుకోవాలని, స్కానర్లు అందుబాటులో లేకపోతే వెంటనే సమకూర్చుకోవాలని సూచించారు. నామినేషన్ పత్రాలను డిజిటల్ రూపంలో భద్రపరిచే ప్రక్రియను అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. అభ్యర్థులు ఏ రాజకీయ పార్టీకి చెందినవారనే విషయంతో సంబంధం లేకుండా అధికారులు సమానంగా వ్యవహరించాలని, స్థానిక ప్రభావాలకు లోనుకాకుండా ఎన్నికల సంఘం నిబంధనలను అమలు చేయాలని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీలు, ఇతర స్థానిక సంస్థలకు సంబంధించిన బకాయిలు లేవనే ధ్రువపత్రాలను సకాలంలో జారీ చేయాలని, వరుస సెలవులు ఉన్నప్పటికీ అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నామినేషన్ల దాఖలుకు పోలీసు నిరభ్యంతర ధ్రువపత్రం తప్పనిసరి కాదని, అభ్యర్థులపై నమోదైన కేసుల వివరాలను స్వీయ ధ్రువీకరణ పత్రంలో పేర్కొనాల్సి ఉంటుందని తెలిపారు. ఈ నిబంధనలపై సంబంధిత అధికారులు స్పష్టమైన అవగాహనతో వ్యవహరించాలని సూచించారు.

**ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు కేంద్రాల గుర్తింపు**

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఎన్నికల సామగ్రి స్వీకరణ కేంద్రాలు, బ్యాలెట్ పెట్టెల భద్రపరిచే గదులు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను వీలైనంత వరకు ఒకే ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్ కేంద్రాల్లో అనువైన భవనాలను గుర్తించి, అక్కడ అవసరమైన వసతులు ఉన్నాయో లేదో పరిశీలించాలని తెలిపారు.

రిటర్నింగ్ అధికారులు స్వయంగా కేంద్రాలను తనిఖీ చేయడంతో పాటు, జిల్లా రెవెన్యూ అధికారులు కూడా పరిశీలించి నివేదికలు అందించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో ఎంపీటీసీ స్థానాల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన ఓట్ల లెక్కింపు గదులను గుర్తించాలని, గత సాధారణ ఎన్నికల్లో వినియోగించిన కేంద్రాలు అనుకూలంగా ఉంటే వాటిని కూడా పరిశీలించాలని సూచించారు. గుర్తించిన తొమ్మిది గదులతో పాటు, బ్యాలెట్ పెట్టెల భద్రతకు, ఓట్ల లెక్కింపునకు అవసరమైన గదుల అనుకూలతను పరిశీలించి, అన్ని ఏర్పాట్లపై మరుసటి రోజు సాయంత్రంలోగా తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు.

**ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి: జిల్లా పరిశీలకుడు**స్థానిక సంస్థల ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకుడు గణేష్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో ప్రతి అధికారి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. ఎన్నికల ప్రక్రియను పరిశీలకులు నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల సంఘం ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, తదుపరి కార్యాచరణను నోడల్ అధికారులు దృశ్య ప్రదర్శన ద్వారా వివరించారు. ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పూర్తి చేసి, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సమష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారులను ఆదేశించారు.



# 11 స్థానాలు మనవే!

## ఎంపీటీసీ అభ్యర్థులు సైతం కర్ణాటకకు!

**బండి ఆత్మకూరు నంది పత్రిక అక్టోబర్ 19:** బండి ఆత్మకూరు మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలలో 11 స్థానాలు మనమే దక్కించుకుంటామని శ్రీశైల మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. సోమవారం రాత్రి నంద్యాలలో బండి ఆత్మకూరు మండలంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు మాజీ సర్పంచులు మాజీ ఎంపిటిసి సభ్యులు అనుబంధ సంస్థలు, గ్రామస్థాయి మండల స్థాయి నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ మండలంలో మూడు ఎంపీటీ స్థానాలు మినహా 11 స్థానాలను మనమే దక్కించుకుంటామని కార్యకర్తలతో పేర్కొన్నట్లుగా తెలుస్తోంది. మండలంలోని మూడు ఎంపీటీ స్థానాలలు మనకు అనుకూలంగా లేవని సమావేశంలో మాట్లాడినట్లుగా ప్రచారం జరుగుతూ ఉంది. మండల పరిషత్తు అధ్యక్ష స్థానానికి సంబంధించి సంత జుటూరు ,పార్నపల్లె గ్రామాలలో అభ్యర్థులను రంగంలోకి దించాలని రాజకీయ ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆత్మకూరు మునిసిపాలిటీకి సంబంధించి నామినేషన్లు వేసిన కౌన్సిలర్ లను కర్ణాటక కు తరలించిన తరహాలోనే, మండలంలో నామినేషన్లు వేసిన ఎంపిటిసి సభ్యులందరినీ కర్ణాటకకు తరలించాలని నిర్ణయించారని తెరపైకి వచ్చింది. ఆత్మకూరు మునిసిపాలిటీ కి సంబంధించి అభ్యర్థులను తెలుగుదేశం పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురిచేసి వారికి సంబంధించిన నామినేషన్లను విత్ డ్రా చేస్తారన్న, ఉద్దేశంతో వారిని ఇతర ప్రాంతాలకు తరలించడం జరిగిందని, బండి ఆత్మకూరు మండలంలో ఒక్కొక్క ఎంపిటిసి స్థానానికి ముగ్గురు చొప్పున నామినేషన్లను వెయ్యాలని వైయస్సార్ పార్టీ నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది.

## టిడిపిని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరికలు



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 19, నంది పత్రిక** ఆళ్ళగడ్డలోని వైఎస్ఆర్ కాంగ్రెస్స్ పార్టీ కార్యాలయములో కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ శాసన సభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి ల సమక్షంలో సోమవారం శిరివెళ్ల మండలం ఇసుకపల్లే గ్రామస్తులు టిడిపిని వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నిమ్మకాలయాల శ్రీనివాస రెడ్డి, మేకల వెంకట నారాయణ, సారెడ్డి బాలి రెడ్డి, సారెడ్డి తిమ్మారెడ్డి ల తో పాటు సుమారు 10 కుటుంబాల వారికి కర్నూల్ పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి వైఎస్ఆర్సిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శిరివెళ్ల మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు ఇందూరి ప్రతాప్ రెడ్డి, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలం దేవస్థానంలోదసరా మహోత్సవాలు







**శ్రీశైలం అక్టోబరు19(నంది పత్రిక)** శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా తొమ్మిదవ రోజైన (19.10.2026) ఉదయం అమ్మవారికి ప్రాతఃకాల పూజలు, విశేషకుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారములు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానములు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు, కుమారీపూజలు జరిపించబడ్డాయి. అదేవిధంగా రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్ర పారాయణలు జరిపించబడ్డాయి. అదేవిధంగా ఈ సాయంకాలం జపములు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీ హోమం జరిపించబడుతాయి. రాత్రి 9.00గంటల నుండి అమ్మవారి ఆస్థానసేవ, సువాసినీపూజలు, రాత్రి గం. 10.00లకు కాళరాత్రిపూజలు జరుగనున్నాయి. కుమారీ పూజదసరామహోత్సవాలలో భాగంగా ప్రతీరోజు కుమారీ పూజలు నిర్వహించడం జరుగుతోంది. ఈ కుమారిపూజలో రెండుసంవత్సరాల నుంచి పదిసంవత్సరాల వయస్సు ఉన్న బాలికలకు పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించి పూజించడం జరుగుతోంది. కుమారిపూజ నవరాత్రి ఉత్సవాలలో ఒక ముఖ్యమైన సంప్రదాయం

**సిద్ధిదాయినీ అలంకారం**ఈ నవరాత్రి మహోత్సవాలలో చేయబడుతున్న నవదుర్గ అలంకారాలలో భాగంగా శ్రీ అమ్మవారి ఉత్సవమూర్తిని సిద్దిదాయినీస్వరూపంలో అలంకరింపజేయడం జరిగింది. సిద్ధిదాయినీదేవి అమ్మవారు చతుర్భుజాలను కలిగి ఉండి కుడివైపున చక్రము, గద, ఎడమవైపున శంఖము, పద్మాలను ధరించి ఉంటుంది. ఈ దేవిని ఉపాసించడం వల్ల అణిమ, మహిమ, గరిమ, లఘిమ మొదలుగు అష్ట (ఎనిమిది) సిద్ధులను పొందవచ్చునని చెప్పబడింది. సర్వదేవతలు, యక్షులు, గంధర్వులు ఈ దేవిని సదా సేవిస్తుంటారని పండితులు పేర్కొంటున్నారు. ఈ అమ్మవారిని పూజించడం వల్ల కోరిన కోర్కెలన్నీ నెరవేరుతాయని చెబుతారు.

**కైలాసవాహనసేవ**ఈ ఉత్సవాలలో శ్రీస్వామిఅమ్మవార్లకు నిర్వహిస్తున్న వాహనసేవలలో భాగంగా కైలాసవాహనసేవ జరిపించబడుతుంది. ఈ వాహనసేవలో శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరింపజేసి, కైలాసవాహనంపై వేంచేబు చేయించి పూజాదికాలు చేయబడుతాయి.

**రేపటి కార్యక్రమాలు**( 20.10.2026) విజయదశమి సందర్భంగా ఉదయం గం. 6.00ల నుంచి విశేషపూజలు, గం. 9.15 లకు సహస్ర చండీపారాయణ పూర్వక శతచండీయాగ పూర్ణాహుతి, గం. 10.00లకు రుద్రయాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, వసంతోత్సవం, అవభృథం తదితర విశేషపూజలు జరుగనున్నాయి. అలాగే సాయంత్రం శ్రీభ్రమరాంబాదేవి అమ్మవారికి నిజరూపాలంకరణ, శ్రీస్వామిఅమ్మవార్లకు నందివాహనసేవ, రాత్రి గం. 7.00లకు ఆలయ ఉత్సవం, శమీపూజ, రాత్రి గం. 8.00లకు తెప్పోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించబడుతాయి.




## రాజకీయ పార్టీల నేతలతో సమావేశం



**జూపాడుబంగ్లా అక్టోబర్ 19 (నంది పత్రిక)** ప్రస్తుత స్థానిక ఎన్నికల నేపథ్యంలో జూపాడుబంగ్లా మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో సోమవారం మండల రాజకీయ పార్టీల అఖిలపక్ష సమావేశాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్ నాయక్ మాట్లాడుతూ ఎంపీటీసీ, జెడ్పీటీసీ అభ్యర్థులు నామినేషన్ వేసేటప్పుడు సరైన పత్రాలను కలిగి ఉండాలన్నారు. నామినేషన్ ప్రక్రియను గురించి క్షుణంగా వివరించారు. నామినేషన్ సమయంలో ఎటువంటి అల్లర్లు గొడవలు జరగకుండా పార్టీలకు చెందిన ప్రతినిధులు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో పద్మావతమ్మ, ఏవో మధుసూదనయ్య, మోహన్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# మహానంది మండలంలో పరిషత్ ఎన్నికలకు సర్వం సిద్ధం..

## ఎంపీడీవో మహబూబ్ దౌలా



**మహానంది అక్టోబర్ 19 (నంది పత్రిక):-**మహానంది మండలంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో మహబూబ్ దౌలా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 38 పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ పత్రాలను ఆయా గ్రామ పంచాయతీలకు సురక్షితంగా పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఆయన గ్రామ పంచాయతీ అధికారులకు ఇప్పటికే విధులు కేటాయించి తగిన సూచనలు ఇచ్చామన్నారు. ఏవో శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో భార్గవి లత, సంజీవ కుమార్ పాల్గొన్నారు.

# జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలి**

**నామినేషన్ కేంద్రం ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

**నంద్యాల బ్యూరో, అక్టోబరు 19(నంది పత్రిక):-** జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టి, అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం, ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి, అక్కడ చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నామినేషన్ల స్వీకరణకు సంబంధించి రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓ), హెల్ప్ డెస్క్ సిబ్బంది కూర్చునే ప్రదేశాలను స్పష్టంగా నిర్దేశించి, విధుల నిర్వహణలో ఎలాంటి గందరగోళానికి తావులేకుండా చూడాలని సూచించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులు వేచి ఉండేందుకు తగిన స్థలాన్ని ఏర్పాటు చేయాలని, కేంద్రం వద్ద రద్దీ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నిబంధనల ప్రకారం నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధికి వెలుపల వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేసి, ఎన్నికల మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను సంబంధిత అధికారులు సమన్వయంతో నిర్వహించాలని, బాధ్యతలు అప్పగించిన అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్ కేంద్రంలో అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించి, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎస్డిపిఓ సుస్మిత, జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



## రాజరాజేశ్వరీ దేవి గా శ్రీశ్రీశ్రీ కాళికా మాత అమ్మవారు



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 19, నంది పత్రిక** ఆళ్లగడ్డ విశ్వరూప పారిశ్రామిక నగర్ లో వెలసిన శ్రీ కాళికా మాత దేవస్థానము నందు అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి, రాజరాజేశ్వరీ దేవిగా అలంకరించి, అర్చకులు చంద్రశేఖర్ ఆచార్యులు, లోకేష్ ఆచార్యులు పూజలు నిర్వహించగా ఉభయదారులు పూజలో పాల్గొన్నారు. అనంతరం మహా మంగళహారతి యిచ్చి, తీర్థ ప్రసాదాలు అందించారు. సాయంత్రం మహిళా కమిటీ సభ్యులకు వినోదభరిత కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అల్పాహారాం పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు యద్దనపూడి శ్రీనివాసాచార్యులు, ఉపాధ్యక్షులు ముత్తలూరు సురేష్ ఆచార్యులు, ప్రధాన కార్యదర్శి యాడిగోపాలాచార్యులు, కోశాధికారి రామ్మోహన్ ఆచార్యులు, మహిళా కమిటీ, యువజన కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వాసవీ మాత



**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 19, నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణము లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో సోమవారం శ్రీ దుర్గాదేవి అలంకారంలో శ్రీ వాసవీమాత భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయప్రధాన అర్చకులు కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో అలంకరించి, విశేష పూజలు, కుంకుమార్చన కార్య క్రమాలను నిర్వహించారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమశీలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు, కార్య నిర్వాహక అధ్యక్షుడు బైసానిరవి ప్రకాష్ తోపాటు కమిటిసభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు



**కడప, బ్యూరో చీఫ్ అక్టోబర్ 19 నంది పత్రిక** : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగే.. విజయదశమి అని, ఈ పండుగ జిల్లా ప్రజలందరికీ విజయాలు చేకూర్చాలని ఆకాంక్షిస్తూ.. జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి నిదర్శనంగా జరుపుకునే ఈ విజయదశమి పండుగ.. అందరికీ మంచి చేకూర్చాలని.. సకాలంలో మంచి వర్షాలు కురిసి.. జిల్లాలో పంటలు సమృద్ధిగా పండాలని, అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి పథంలో నడవాలని, శాంతి, సౌభాగ్యాలు, సుఖ సంతోషాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని వారు ఆకాంక్షించారు.

# ఎన్నికల నిబంధనలు, చట్టాలపై పూర్తి అవగాహనతో విధులు నిర్వర్తించాలి

## నామినేషన్ల స్వీకరణ, పరిశీలనలో నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలి

## ఎన్నికల నిర్వహణలో సమన్వయం, సమయపాలన అత్యంత కీలకం

## మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి




**నంద్యాల బ్యూరో, అక్టోబరు 19(నంది పత్రిక):-** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, చట్టబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సూచించారు. సోమవారం మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన అధికారులు, నామినేషన్ల స్వీకరణ బాధ్యతలు నిర్వహించే సిబ్బందికి నామినేషన్ల దాఖలు, స్వీకరణ, పరిశీలన ప్రక్రియలపై మాస్టర్ ట్రైనర్లు సమగ్ర శిక్షణ అందించి, ఎన్నికల నిబంధనలు, విధివిధానాలపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి అధికారి ఎన్నికల చట్టాలు, నిబంధనలు, స్టాట్యూటరీ ఫారాలు, సంబంధిత మార్గదర్శకాలను క్షుణ్ణంగా చదివి పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

**అఫిడవిట్ల పరిశీలనలో నిబంధనలే ప్రామాణికం**

నామినేషన్లతో పాటు సమర్పించే అఫిడవిట్లలో అన్ని కాలమ్‌లను అభ్యర్థులు పూర్తిగా నింపేలా పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అఫిడవిట్ల పరిశీలన సమయంలో ప్రతి అంశాన్ని జాగ్రత్తగా తనిఖీ చేస్తూ, చట్టబద్ధమైన నిబంధనల ప్రకారమే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. అభ్యర్థులు సమర్పించే వివరాలు, పత్రాల చెల్లుబాటును వర్తించే ఎన్నికల చట్టాలు, నిబంధనల ప్రకారం నిర్ధారించాలని, ఏకపక్ష నిర్ణయాలకు తావివ్వరాదని సూచించారు.

**సమన్వయంతో పనిచేసి ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహించాలి**

ఎన్నికల విధులు బాధ్యతతో కూడుకున్నవని, అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎదురయ్యే ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ సంయమనం పాటించాలని, ఎవరైనా ఇబ్బందులు కలిగించినా సహనం కోల్పోకుండా, వివాదాలకు తావివ్వకుండా విధులను పూర్తి చేయాలని సూచించారు.

**సమయపాలనతో ఎన్నికల సామగ్రి పంపిణీకి సిద్ధం కావాలి**

శిక్షణ అనంతరం సంబంధిత అధికారులు నిర్ణీత సమయానికి పంపిణీ కేంద్రాలకు చేరుకోవాలని, ఎన్నికల సామగ్రి పంపిణీకి ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సామగ్రిని ముందుగానే సక్రమంగా విభజించి, అవసరమైన వివరాలను తనిఖీ చేసుకోవాలని, సంబంధిత అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ఎలాంటి గందరగోళానికి తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

**ఓటర్ల జాబితాలు, ఎన్నికల వివరాల నవీకరణపై ప్రత్యేక దృష్టి**

ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్ సిబ్బంది, కౌంటింగ్ టేబుళ్లు, సంబంధిత ఎన్నికల అధికారుల వివరాల్లో మార్పులు చోటుచేసుకుంటే వాటిని ఎప్పటికప్పుడు సరిచూసుకుని నవీకరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందస్తుగా ధృవీకరించుకోవాలని, విధుల కేటాయింపు నుంచి ఎన్నికల సామగ్రి పంపిణీ వరకు అన్ని దశల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్లు అందించే శిక్షణను అధికారులు సద్వినియోగం చేసుకుని, తమకు అప్పగించిన బాధ్యతలపై సంపూర్ణ అవగాహనతో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, సజావుగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

# బేతంచెర్ల అమ్మవారి దండను రూ.51 వేలకు దక్కించుకున్న సూర్య బల్లాని దంపతులు



**బేతంచెర్లఅక్టోబర్19(నందిపత్రిక).** బేతంచెర్ల పట్టణంలోని అమ్మవారి శాలలో ప్రతి సంవత్సరం దసరా నవరాత్రి ఉత్సవాలు అంగ రంగ వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లోనే దుర్గాష్టమి రోజున వేసే దండకు ఒక ప్రత్యేక విశిష్టత ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో ఈ దండను దక్కించుకోవడానికి పోటీ పడుతుంటారు. అమ్మవారి దండను దక్కించుకుంటే ఆ ఏడాది అంతా శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఈ సంవత్సరం ఆ పవిత్రమైన దుర్గాష్టమి దండను మన బేతంచెర్లకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, మన బల్లాని బ్రాండ్స్ అధినేత సూర్య బల్లాని దంపతులు రూ. 51 వేలకు కైవసం చేసుకోవడం జరిగింది. సోమ వారం అమ్మవారి శాలలో అయ్యగారి వేద మంత్రోచ్ఛారణలు, మంగళ ఆశీర్వచనాల మధ్య వేద పండితుల సమక్షంలో సూర్య బల్లాని దంపతులకు అమ్మవారి దండను ఘనంగా అందజేశారు. ఈ సందర్భంగా అయ్యగారు దంపతులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల నిబంధనలు పాటించాలి : ఆర్వో ఎస్.అబ్దుల్ రహిమాన్



**మహానంది అక్టోబర్ 19 (నంది పత్రిక):-** మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఎస్.అబ్దుల్ రహిమాన్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఎన్నికల సరళి, నిబంధనలపై పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు .ఈ నెల 21వ తేదీ నుంచి 23 తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉంటుందన్నారు. 24వ తేదీ నామినేషన్ల పరిశీలన, 25వ తేదీ అభ్యర్థులకు అప్పీలు చేసుకునే అధికారం ఉంటుందన్నారు. 27వ తేదీ నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహబూబ్ దౌలా, ఏవో శ్రీనివాస్ రెడ్డి,డిప్యూటీ ఎంపీడీవో భార్గవిలత, సంజీవ కుమార్, ఏఎస్ఐ జి.వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

# కామేశ్వరి అమ్మవారికి ఒక తులం బంగారు కళ్ల విరాళం



**మహానంది అక్టోబర్ 19 (నంది పత్రిక):-** ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరీ అమ్మవారికి సోమవారం ఒక తులం బంగారు కళ్లను దాతలు విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన భక్తులు పెక్కీ శ్రీనివాస సుధాకర్, మీనాక్షి సుబ్బలక్ష్మమ్మ దంపతులు తమ భక్తిని చాటుకుంటూ కానుకను సమర్పించారు. సుమారు రూ. 1,50,000 విలువైన తులం బంగారంతో ప్రత్యేకంగా చేయించిన ఈ కళ్లను ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డికి దంపతులు భక్తిపూర్వకంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతల ఉదారత్వాన్ని ఈవో అభినందించారు. అనంతరం వారికి ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, స్వామివార్ల తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మధు, ప్రధాన అర్చకులు మామిళ్ళపల్లి అర్జున శర్మ, వేదపండితులు రవిశంకర్ అవధాని,సిబ్బంది పాల్గొన్నారు.

# 48, 49 వ డివిజన్ ల టిడిపి కార్పొరేటర్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

## ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్ పర్సన్, టిడిపి నంద్యాల పార్లమెంట్ మహిళా విభాగం అధ్యక్షురాలు కే పార్వతమ్మ



**కర్నూలు సిటి నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ పరిధి 48 49వ డివిజన్లకు కూటమి మద్దతుతో టిడిపి అభ్యర్థులుగా రాఘవేంద్ర ఆచారి, శివ పార్వతి ఆదివారం నామినేషన్లు వేశారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి నంద్యాల పార్లమెంట్ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్పర్సన్ కే పార్వతమ్మ మాట్లాడుతూ స్థానిక ప్రజల మద్దతుతో భారీ ర్యాలీ నిర్వహిస్తూ రాఘవేంద్ర ఆచారి, శివ పార్వతి కార్పొరేటర్ అభ్యర్థులుగా నామినేషన్ వేశారు వీరిద్దరిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో వైసిపి ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని ప్రజలకు సంక్షేమ పథకాలు అందించలేదని విమర్శించారు అందుకే 2024లో అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర ఓటమిని చవి చూసిందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికలలో కూడా వైసీపీకి పరాభవం తప్పదన్నారు టిడిపి యువ నాయకులు శివ మాట్లాడుతూ వైసీపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మవద్దని సంక్షేమం అభివృద్ధి కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని తెలిపారు. కేంద్రంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ఉన్నాయని స్థానిక సంస్థల్లో కుటుంబ అభ్యర్థులను గెలిపిస్తే ట్రిబుల్ ఇంజన్ సర్కార్ తో మరింత అభివృద్ధి సంక్షేమం జరుగుతుందని తెలిపారు వైసిపి నాయకులు చేసే అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# 47వ డివిజన్ ప్రచారంలో దూసుకుపోతున్న టిడిపి అభ్యర్థి రెడ్డి గారి తిరుమలేశ్వర్ రెడ్డి



**కర్నూలు సిటీ నంది పత్రిక** కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 47 వ డివిజన్ కార్పొరేటర్ స్థానానికి టిడిపి అభ్యర్థిగా రెడ్డి గారి తిరుమలేశ్వర్ రెడ్డి పార్టీ ఇచ్చిన బి ఫారం ను ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. డివిజన్ పరిధిలోని గీతా నగర్లో తిరుమలేష్ రెడ్డి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి తిరుగుతూ తనకు మద్దతు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా తిరుమలేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం అభివృద్ధి పథకాల వల్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు. ఐదేళ్ల పాలనలో వైసిపి నాయకులు ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు

# కార్పొరేషన్ కార్పొరేటర్ అభ్యర్థికి బి ఫారం అందజేత



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరపాలక సంస్థకు కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయు కార్పొరేటర్ అభ్యర్థి 24 వార్డుకు కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ దాఖలు చేసిన యం మద్దమ్మ కి ఎఐసిసి సభ్యులు జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ జె లక్ష్మీ నరసింహ యాదవ్ మద్దమ్మ కి పార్టీ కండువా వేసి, బీ ఫారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసి అధ్యక్షులు కే బాబురావు, కర్నూల్ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్ రావు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఐ ఎన్ టి యు సి సిటీ అధ్యక్షులు రేపల్లె ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు షేక్ మాలిక్, వార్డు ఇన్చార్జి షబ్బీర్, నాగరాజు మొదలగు వారు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన మంత్రి టీజీ భరత్

**కర్నూలు సిటీ నంది పత్రిక** విజయానికి, ధర్మానికి ప్రతీకగా నిలిచే విజయదశమి పర్వదినాన్ని జిల్లా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మంత్రి టీజీ భరత్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమి పండుగ ప్రతి ఒక్కరిలో నూతన ఉత్సాహాన్ని, సానుకూల ఆలోచనలను నింపాలని, జిల్లా ప్రజలందరికీ శుభం కలగాలని మంత్రి టీజీ భరత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



# మహానంది క్షేత్రంలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

## రావణ వాహనంపై "సిద్ధిధాత్రి దుర్గ"గా శ్రీ కామేశ్వరి అమ్మవారు





**మహానంది అక్టోబర్ 19 (నంది పత్రిక):-** ప్రముఖ శైవ క్షేత్రమైన మహానంది ఆలయంలో శ్రీ కామేశ్వరి దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 9వ రోజైన సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం శ్రీ కామేశ్వరి అమ్మవారి మూలమూర్తి భక్తులకు 'శ్రీ లలిత దేవి' రూపంలో దర్శనమిచ్చారు. సాయంత్రం రావణ వాహనంపై 'శ్రీ సిద్ధిధాత్రి దుర్గ' అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ల పర్యవేక్షణలో యాగశాలలో వేదపండితులు రవిశంకర్ అవధాని బృందం, రుత్వికులు, అర్చకుల ఆధ్వర్యంలో పూజల దాతలతో కలిసి నవదుర్గ కలశ అర్చనలు, శతచండీయాగము, శ్రీచక్ర నవావరణార్చనలను భక్తిశ్రద్ధలతో జరిపారు. సాయంత్రం వేళ అలంకార మండపంలో అమ్మవారికి కనుల పండుగగా సహస్ర దీపాలంకరణ సేవ, అష్టవిధ మహా మంగళహారతులు, సామూహిక కుంకుమార్చనలు మహా వైభవంగా నిర్వహించారు. రాత్రి వేళ రావణ వాహనంపై సిద్ధిధాత్రి దుర్గగా కొలువైన అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, మంగళ వాయిద్యాలు, మేళతాళాలు మరియు అశేష జనవాహిని నడుమ గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, ఏఈఓ మధు, ఆలయ పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి, నీలకంఠేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్యలతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



# శ్రీ వాసవి మాత అమ్మవారిని దర్శించుకున్న టిడిపి సీనియర్ నాయకుడు ఏవి సుబ్బారెడ్డి దంపతులు

**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 19, నంది పత్రిక** ఆళ్లగడ్డ పట్టణము లోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో సోమవారం శ్రీ దుర్గాదేవి అలంకారంలో శ్రీ వాసవీమాత భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయప్రధాన అర్చకులు కార్తీక్ శర్మ ఆధ్వర్యంలో అలంకరించి, విశేష పూజలు, కుంకుమార్చన కార్య క్రమాలను నిర్వహించారు. దసరా నవరాత్రుల సందర్భంగా టిడిపి సీనియర్ నాయకులు ఏవి సుబ్బారెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు హరీష్ బాబు ఆధ్వర్యంలో వారికి ఆలయ తీర్థం ప్రశాదాలతో పాటు అమ్మవారి శేష వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమశీలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ బాబు, కార్య నిర్వాహక అధ్యక్షుడు బైసానిరవి ప్రకాష్ తోపాటు కమిటిసభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు, పట్టణ ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటాను ఆదరించండి

## 35 వ డివిజన్లో విస్తృత ప్రచారం చేస్తున్న బేతం శ్వేత



**కర్నూలు సిటీ నంది పత్రిక** తనను 35వ డివిజన్ కార్పొరేటర్ గా గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని టిడిపి అభ్యర్థి బెతం శ్వేత అన్నారు. సోమవారం డివిజన్లోని సవరమ్మ కాలనీలో డివిజన్ నాయకుడు చరణ్ తో కలిసి బేతం శ్వేత కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. కలలు మీ ఇంటి ఆడబిడ్డగా భావించి ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# 40 వ డివిజన్లో టిడిపి ఎన్నికల ప్రచార జోరు

## గెలుపు పై ధీమా వ్యక్తం చేస్తున్న కార్పొరేటర్ అభ్యర్థి పేరపోగు చిన్న మారెన్న

**కర్నూలు సిటి నంది పత్రిక** కర్నూల్ కార్పొరేషన్ పరిధి 40 వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా పేరపోగు చిన్న మారెన్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి చేతుల మీదుగా బి ఫామ్ అనుకున్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని తిరుమలగిరిలో పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న మారెన్న మాట్లాడుతూ ఇంటింటికి తిరుగుతూ ప్రతి ఓటర్ ను కలిసి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. నాయకులు కార్యకర్తలు సహకారంతో విజయం తనదేనని ధీమ వ్యక్తం చేశారు కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications #2-189, journalist colony, lakshmi narasimha swamy temple back side, Pulivendula Town, Y.S.R Kadapa District, Andhra Pradesh -PinCode:-516390, GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No:-APTEL/26/A6827 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# ఎన్నికల నిబంధనలు నిర్వహణపై రాజకీయ నాయకులకు దిశ నిర్దేశం

**ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 19 నంది పత్రిక**ఆళ్లగడ్డ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలు నిర్వహణపై రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని ప్రజాపరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ నూర్జహాన్ బేగం తాసిల్దార్ జ్యోతి రత్నకుమారి పాల్గొన్న ఈ సమావేశానికి ఎన్నికల అధికారి హరి గోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎన్నికల అధికారి పలు పార్టీల నాయకులు హాజరయ్యారు.ఎన్నికల ప్రక్రియ, చట్టపరమైన నిబంధనలు, రాజకీయ నాయకులు పాటించాల్సిన నియమాలపై చర్చించి దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులు చట్టపరమైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని నాయకులకు వివరించారు. అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 3, 2026న పోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ స్థానాలు రిజర్వేషన్ లఆధారంగా నామినేషన్ దాఖలు చేయాలని సెల్ఫ్ డిక్లరేసన్,ఆదాయ పన్ను అభ్యర్థులను బలపరిచే వారిది మరియు ఏజెంట్ ఆధార్ కార్డులు తప్పనిసరిగా ఉండాలని అన్నారు.కోర్టు కేసులు విచారణ మరియు పెండింగ్ కేసులు ఉంటే కనపరసాలన్నారుఆస్తుల వివరాలు,వ్యక్తిగత రుణాలు, వాహనాల వివరాలు,ఆస్తుల విలువ. వృత్తి వివరాలు విద్యా అర్హత కోర్సు వివరాలు స్పష్టం చేయాలన్నారు.ఆస్తి పన్ను నో డ్యూ సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు.ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాల వారు డిపాజిట్ రాయితీ కోసం క్యాస్ట్ మరియు ఇన్కమ్ సర్టిఫికెట్ అందజేయాలనిఎంపీటీసీలు 1500 జడ్పిటిసిలు 3000 డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

అభ్యర్థులు కాకుండా ఇతరుల ఇళ్లపై అనుమతులు లేకుండా పార్టీ జెండాలు పెట్టరాదనిర్యాలీలు సభలు సమావేశాలు పెట్టాలంటే పోలీస్ శాఖ అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. కూలింగ్ సమయానికి 48 గంటల ముందే ప్రచారం ముగించాల్సి ఉంటుందన్నారు.ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ ఉద్యోగులు ప్రచార కార్యక్రమంలో పాల్గొనరాదన్నారు.సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఒక్కసారి ఎలక్షన్ కేసులలో ఇరుక్కుంటే ప్రతి ఎన్నికలకు కేసు వెంటాడుతుందని హెచ్చరించారు.లాయర్ ద్వారా గాని తెలిసిన వారి ద్వార నామినేషన్ పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఒక అభ్యర్థికి ఇద్దరు వ్యక్తులు మరియు డ్రైవర్ తో నలుగురు మించి ఉండరాదు అన్నారు.అభ్యర్థులకు సంబంధించిన వెహికల్ పై స్టిక్కర్ లు అర్ ఓ రిటర్నింగ్ అధికారి సంతకం ఉండాలని వాహనాలు 100 మీటర్ల దూరం లో ఆగిపోవాలని సూచించారు.అక్టోబర్ 21 నుండి 23 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని ఉదయం 10-30 సాయంత్రం 5 గంటలలోపు నామినేషన్ దాఖలు తీసుకోవచ్చునన్నారు.21 నుండి 23 వరకు నామినేషన్ల స్వీకరణ, 24న నామినేషన్ల పరిశీలన, 25న అప్పీల్ల దాతలు, 26న అప్పీల్లపై తుది నిర్ణయం, 27న నామినేషన్ల ఉపసంహరణ అదే రోజు 27న అభ్యర్థుల జాబితా ప్రకటన. నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 4న అవసరమైతే రీపోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు ఫలితాలు ఉంటాయని వివరించారు. ఆళ్లగడ్డ మండల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో ఎన్నికల హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తామని అవసరమైన సమాచారం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎన్నికల కోడ్ ప్రారంభమైనప్పటినుండి మండల వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ముగ్గురికి మించి గుంపులు గుంపులుగా ఉండరాదన్నారు. క్రాంతి భద్రతలకు విగాథం కలిగిస్తూ అల్లర్లకు పాల్పడితే



పోలీస్ శాఖ చర్యలు కఠినంగా ఉంటాయని

ఆళ్లగడ్డ మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని ఎక్కడైనా పోటీ చేయవచ్చని తెలిపారు. ఎంపీటీసీలు 4 లక్షలు జడ్పిటిసి 8 లక్షలు మించి ఖర్చు చేయరాదని అబ్జర్వర్లు ఎన్నికల అధికారులు ప్రత్యేక పోలీస్ బలగాల నిఘా నీడలో నామినేషన్ నుండి కౌంటింగ్ వరకు ఎన్నికల కోడ్ ముగిసే వరకు అభ్యర్థులు చేసే ఖర్చును చూపించాల్సి ఉంటుందన్నారు.ప్రభుత్వ గుర్తింపు ఉన్న సంఘాలు సొసైటీ అధ్యక్షులు కమిటీ వారు నామినేషన్ వేయడానికి అనర్హులని లోకల్ బాడి ఎంపిటిసిలు గతంలో మాదిరిగానే ఎంపీపీని ఎన్నుకుంటారన్నారు.ఓటరు లిస్ట్ ఆయా గ్రామ పంచాయితీ కార్యదర్శుల వద్ద ఉన్నాయని అభ్యర్థులు హోటల్ జాబితాను పొందవచ్చని తెలియజేశారు. ఎన్నికల నిర్వహణలో పార్టీల నాయకులు కార్యకర్తలు ఓటర్లు సహకరించాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. ఈ సమావేశానికి టిడిపి హరికుమార్ రెడ్డి వైసిపి గంగుల రామిరెడ్డి కాంగ్రెస్ పార్టీ బి హుస్సేన్ భాష బిజెపి లక్ష్మిరెడ్డి జనసేన సమాజ్వాది పార్టీ మరియు ఇతర పార్టీ వారు పాల్గొన్నారు

# సీతమ్మధారలో 10 లక్షల కరెన్సీ తో జగన్మాత దర్శనం

### దసరా సంబరాలు సమైక్యత కు సాధనాలు
### దైవ, దేశభక్తి తోనే జీవితం సాఫల్యం
### నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి



**సీతమ్మధార అక్టోబర్ 19** సంబరాలు సమైక్యతను పెంపొందించేందుకు సాధనాలని నగర పోలీస్ కమిష నర్ శంఖబ్రత బాగ్చి పేర్కో న్నారు. సీతమ్మధార ఏ.పి. ఎస్.ఈ. బి. కాలనీ వెల్ఫేర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో సోమవారం ఆయన పాల్గొని ప్రత్యే క పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "దైవ, దేశ భక్తితో జీవనాన్ని సాగించినట్లయితే జీవితంలో ఎన్నో సత్ఫలితాలను సాధించవచ్చని బాగ్చి అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు విశాఖ పట్నం నేడు దేశంలోనే ప్రధాన వేదికగా నిలుస్తున్నదని, ఇందుకు ప్రజలు ప్రోత్సాహం, ఆదరణ కారణమన్నారు. అనంతరం. స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ కు చెందిన గోక డింపుల్, ఎన్. జోషిత, పి. శ్రావణి, దేవ హర్షిని, తరణ్య బృందం, కె సాత్విక,' ఎం. నిక్షిత, ఎస్. యామిని, నిత్య ఐశ్వర్య హాసినిల బృందం ' చేసిన బహుభాషా నృత్యాలు వేశేషంగా ఆకట్టు కున్నాయి నిర్వహక సంఘం సారదులు కొండ్రు రామారావు, సింహాద్రిరాజు, చలసాని సుజని, కె. సత్య రాజు, ఎన్. నాగేంద్ర కుమారిలు కళాకారులను, సంఘ సేవకులను ఘనంగా సత్కరించారు. వైస్ చైర్మన్ బి.గురునాథ రావు సంధాన కర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సిహెచ్.ఎస్.ఆర్.ఎల్. శాస్త్రి, ఎం. మహేశ్వరరావు, జ్యోతి రాణి , జి. మంజులరాణి , కొండ్రు ఉదయ, న్యాయవాది, గాయకులు రంగనాథ్, కొరియో గ్రాఫర్ ఆర్. నాగరాజ్ పట్నాయక్, ఆర్. హెచ్ టీన తది తరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఇక్కడ అమ్మవారిని సుమారు పది లక్షలు రూపాయలతో అందంగా అలంకరించారు.



# ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూల్ విడుదల

### ఎన్నికల ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 19 నంది పత్రిక** పశ్చిమ గోదావరి జిల్లాలోని 20 జెడ్పీటీసీ, 371 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్‌ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియను నిర్ణీత తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ అక్టోబర్ 21, 2026న ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రారంభమవుతుంది. నామినేషన్ల స్వీకరణకు అక్టోబర్ 23, 2026 సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉంటుంది. నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 24, 2026న ఉదయం 8 గంటల నుంచి నిర్వహిస్తారు. తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్లను అక్టోబర్ 25, 2026 సాయంత్రం 5 గంటల వరకు దాఖలు చేసుకోవచ్చు. ఆ అప్పీళ్లపై అక్టోబర్ 26, 2026న నిర్ణయం తీసుకుంటారు.నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 27, 2026 మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉంటుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తరువాత పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. పోలింగ్ నవంబర్ 3, 2026న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. అవసరమైతే రీపోలింగ్ నవంబర్ 4, 2026న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు.ఓట్ల లెక్కింపు నవంబర్ 5, 2026న ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది. ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు.ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ తదితర ఎన్నికల ప్రక్రియలను సంబంధిత రిటర్నింగ్ అధికారులు నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను జిల్లా ప్రజా పరిషత్ రిటర్నింగ్ అధికారి అయిన జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను షెడ్యూల్‌కు అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు.

# పట్టణ మరియు గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు 2026 వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్ష

**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 19 నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పూనేతా అన్ని జిల్లాల కలెక్టర్ జిల్లా కలెక్టర్లు జిల్లా ఎస్పీ లు అబ్జర్వర్లు, సీఈవోలు, డిపిఓ లతో ఎన్నికలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణీ హాజరయ్యారు ఈ సమీక్ష. సమావేశంలో ఎస్ ఈసీ .మునిసిపల్ ఎన్నికల తదుపరి దశ కార్యక్రమాలు పై, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు, గ్రామ పంచాయితీ ఎన్నికల ఏర్పాట్ల పై సమీక్షించారు. కౌంటింగ్ మరియు రిసెప్షన్ కేంద్రాలు డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.మరియు రిటర్నింగ్ అధికారి కార్యాలయాలు, స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలి అని ఆదేశించారు..పోలీస్ డిపార్ట్మెంట్ వారిని మునిసిపల్ ఎన్నికల నామినేషన్ సందర్భంగా రాష్ట్రంలో వివిధ జిల్లాలలో జరిగిన అనుభవాలా దృష్టిలో పెట్టుకుని తగు జాగర్తలు తీసుకోవాలని ఆదేశించారు. మరియు ఆయా జిల్లాల కలెక్టర్ లను నివేదికలు సమర్పించవలసినదిగా ఆదేశించారు.జనరల్ అబ్జర్వర్లు లు కూడా తమ తమ నివేదికలు ఎప్పటికప్పుడు సమర్పించవలసినదిగా ఆదేశించారు. రాష్ట్రంలో మిగిలి ఉన్న 23 మున్సిపాలిటీలకు అక్టోబర్ 30 వ తేదీ లోపు 2వ దశ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తామని ఎందుకు జిల్లా కలెక్టర్ లు ఎస్పీలు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని తెలిపారు

సమీక్ష సందర్భంగా పశ్చిమ గోదావరి జిల్లాలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లు, సన్నదత పై కలెక్టర్ చదలవాడ నాగరాణి వివరించారు



# అధర్మానికి అంతం తప్పదు.. ధర్మానికి విజయం తథ్యం!

### నాడు మహిషాసురుడి అహంకారాన్ని దుర్గమ్మ అంతం చేసింది.. నేడు రాజకీయ మహిషాసురులకు ప్రజాతీర్పే గుణపాఠం
### జగన్ అహంకారానికి, అరాచక రాజకీయాలకు ఆంధ్రప్రదేశ్‌లో స్థానం లేదు
### అధికారం శాశ్వతమని విర్రవీగిన వారికి ప్రజాస్వామ్యంలో పరాభవం తప్పదు
### స్థానిక సంస్థల ఎన్నికల్లో అధర్మ రాజకీయాలను ప్రజాస్వామ్యబద్ధంగా తిరస్కరించాలి
### రాష్ట్ర ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి బ్యూరో చీఫ్, అక్టోబర్ 19: నంది పత్రిక** అధర్మం ఎంత శక్తిమంతమైనదైనా అంతిమ విజయం ధర్మానిదేనని, అహంకారం ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా ప్రజాశక్తి ముందు తలవంచక తప్పదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి, అసత్యంపై సత్యం, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు నింపాలని ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులతో అన్నదాతల ఇంట సిరులు పండాలని, పాడిపంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు రాజకీయ పరిణామాలపై తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పురాణాల్లో మహిషాసురుడి అహంకారాన్ని దుర్గాదేవి అంతం చేస్తే, ప్రజాస్వామ్యంలో రాజకీయ మహిషాసురుల అహంకారాన్ని ప్రజలే తమ ఓటుతో అణచివేస్తారని వ్యాఖ్యానించారు. అధికారం శాశ్వతమని, తాము ఆడిందే ఆట.. పాడిందే పాట అని విర్రవీగిన వారికి ప్రజాతీర్పు ఇప్పటికే తగిన గుణపాఠం చెప్పిందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాలరాసే అహంకార రాజకీయాలకు గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ ప్రతీకగా మారారని విమర్శించారు. కీచక మనస్తత్వంతో సాగించే రాజకీయాలకు, అరాచక పోకడలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు మరింత విజ్ఞతతో వ్యవహరించాలని మంత్రి కోరారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించే నాయకత్వానికి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. వైసీపీ రాజకీయ అహంకారాన్ని, అధికార దుర్వినియోగాన్ని, అరాచక ధోరణులను ఓటు అనే ఆయుధంతో తిరస్కరించాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఆటంకం కలిగించే రాజకీయ పోకడలకు ప్రజలు మరోసారి తగిన సమాధానం చెప్పాలన్నారు. విజయదశమి అంటే కేవలం పండుగ జరుపుకోవడం మాత్రమే కాదని, సమాజంలో పాతుకుపోయిన అహంకారం, అసత్యం, అన్యాయం, అధర్మాన్ని పారదోలాలనే సంకల్పానికి ప్రతీక అని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమం వైపు ముందుకు సాగాలని, రైతులు, కార్మికులు, యువత, మహిళలు సహా అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నిండాలని ఆకాంక్షించారు.

# జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

**భీమవరం, బ్యూరో చీఫ్ అక్టోబర్ 19 నంది పత్రిక** : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగే.. విజయదశమి అని, ఈ పండుగ జిల్లా ప్రజలందరికీ విజయాలు చేకూర్చాలని ఆకాంక్షిస్తూ.. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి నిదర్శనంగా జరుపుకునే ఈ విజయదశమి పండుగ.. అందరికీ మంచి చేకూర్చాలని.. సకాలంలో మంచి వర్షాలు కురిసి.. జిల్లాలో పంటలు సమృద్ధిగా పండాలని, అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి పథంలో నడవాలని, శాంతి, సౌభాగ్యాలు, సుఖ సంతోషాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలని వారు ఆకాంక్షించారు.



# మున్సిపల్, ఎంపీటీసీ, జెడ్ పి టి సి, ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ



**భీమవరం బ్యూరో చీఫ్ అక్టోబర్ 19 నంది పత్రిక** నరసాపురం పురపాలక సంఘం పరిధిలో జరగనున్న మున్సిపల్ ఎన్నికలు, మరియు ఎంపీటీసీ, జెడ్ పి టి సి, ఎన్నికలు , సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా, పకడ్బందీ భద్రతా ఏర్పాట్ల నడుమ నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం నరసాపురంలోని స్థానిక వైన్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ గదిలో చేపడుతున్న ఏర్పాట్లు, ఓట్ల లెక్కింపు కోసం అవసరమైన సదుపాయాలు, సిబ్బందికి కల్పించాల్సిన వసతులు, భద్రతా చర్యలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆమె సూచించారు.కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన టేబుళ్లు, కుర్చీలు, విద్యుత్ సదుపాయం, లైటింగ్, తాగునీరు తదితర మౌలిక వసతులు సమకూర్చాలని తెలిపారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది విధులు నిర్వహించేందుకు అనువైన వాతావరణం కల్పించాలన్నారు.కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి ఉన్న అధికారులు, సిబ్బంది, ఎన్నికల విధులకు సంబంధం ఉన్న వ్యక్తులు మాత్రమే ప్రవేశించేలా తగిన నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. భద్రతా ఏర్పాట్ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహించాలని స్పష్టం చేశారు.అదేవిధంగా ఓట్ల లెక్కింపు సమయంలో అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దశను క్రమబద్ధంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసి, ఎన్నికల నిర్వహణలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని తెలిపారు.మున్సిపల్ , ఎంపీటీసీ, జెడ్పిటిసి,ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో దాసిరాజు, డి ఎల్ డి వో ఎం శ్యామల తదితరులు పాల్గొన్నారు.

